ప్రజాశక్తి

సోమవారం 8 డిసెంబర్ 2025 | 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

హిందూత్వ ముసుగులో
బిజెపి ఫాసిస్ట్ విధానాలు

- లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా పోరాడాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

బిజెపి ఫాసిస్ట్ విధానాలకు వ్యతిరేకంగా లౌకిక, ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నాడు ఒంగోలు సుందరయ్య భవన్‌లో సిపిఎం జిల్లా స్థాయి శిక్షణా తరగతులకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ హిందూత్వ ముసుగులో బిజెపి ఫాసిస్ట్ విధానాలను అమలు చేస్తూ దేశాన్ని ప్రమాదకర దిశగా నడుపుతున్నదని, ఈ విధానాలపై వామపక్ష శక్తులను కూడగట్టి ఎదుర్కోవలసిన అవసరం ఉందని తెలిపారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దేశాన్ని ప్రమాదకర దిశగా నడుపుతున్నదని తీవ్రంగా విమర్శించారు. మతాన్ని రాజకీయాలకు ముడిపెట్టి హిందుత్వ ముసుగులో ప్రజలను విభజించే ప్రయత్నం జరుగుతోందని, దీని ఫలితంగా దేశ లౌకిక శక్తులన్నీ ప్రమాదంలో పడుతున్నాయని హెచ్చరించారు.

దేశ సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టడమే బిజెపి పాలన లక్ష్యమైపోయిందని, రాజ్యాంగ సూత్రాలను అమలు చేయకుండా రాజ్యాంగ విధ్వంసానికి కూడా వెనుకాడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలపై దష్టి పెట్టకుండా మత భావోద్వేగాలను రెచ్చగొట్టడం ద్వారా ప్రజాస్వామ్య విలువలను మరుగున పడేస్తున్నారని విమర్శించారు.

పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ ▶ 5లో

మార్కాపురంలో
రియల్ జోరు



మార్కాపురంలో ఏర్పాటుచేసిన ఓ వెంచర్

- 'జిల్లా' ఏర్పాటుకు సీఎం ఆమోదంతో ఊపందుకున్న వ్యాపారం
- కొత్తగా వెలుస్తున్న వెంచర్లు

ప్రజాశక్తి-మార్కాపురం

నిన్నామొన్నటి వరకు మార్కాపురం జిల్లా అవుతుందా.? లేదా.? అనే అపనమ్మకంలో పశ్చిమ ప్రకాశం ప్రజలు ఉన్నారు. మార్కా పురం జిల్లాగా ఇటీవల సిఎం చంద్రబాబు ఆమోదం తెలపడంతో పశ్చిమ ప్రకాశంలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. త్వరలోనే మార్కాపురం జిల్లా కేంద్రం కాబోతోంది. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఇప్పుడిప్పుడే జోరందుకుంటోంది.

మార్కాపురం కేంద్రంగా జిల్లా పాలన త్వరలో సాగనుంది. కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలతో పాటు ఇతర శాఖలన్నింటికీ జిల్లా స్థాయి కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. ఆయా కార్యాలయాలకు ఉన్నతాధికారులు కూడా ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంది. జిల్లా రాకతో కొంత అభివృద్ధి జరగనుంది. మార్కాపురం జిల్లా పరిధిలోని కనిగిరి, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాలతో పాటు మార్కాపురం నియోజకవర్గ ప్రజలు సైతం నిత్యం ఏదొక కార్యాలయంలో పనుల నిమిత్తం రాకపోకలు సాగించక తప్పదు. మార్కాపురం కేంద్రంగా జిల్లా పరిపాలన ప్రారంభమైన తరువాత మార్కాపురం పరిస్థితి ఒక్కసారిగా మారిపోనుంది. ఉపాధి అవకాశాలు కొంతమేర మెరుగుపడే అవకాశాలు ఉంటాయి. వెనుకబడిన మార్కాపురం ప్రాంతం గతంలో కంటే మెరుగ్గా అభివృద్ధి చెందే అవకాశాలు లేకపోలేదు.

ఇప్పటివరకు స్తబ్ధతగా ఉన్న రియల్ ఎస్టేట్ రంగం మళ్లీ ఊపందుకుంది. పాలకపక్ష నేతలూ జిల్లా ఇచ్చామని, ఇక అభివృద్ధి కూడా తమదే బాధ్యత అని చెప్పడం జరుగుతోంది. ఏది ఏమైనా కొత్తగా వెంచర్లు వెలుస్తున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంటోంది. ఇప్పట్లో స్థలాలు కొనుగోలు చేయలేకపోతే జిల్లా పాలన ప్రారంభమైన తరువాత స్థలాల ధరలు అమాంతం పెరుగుతాయని కొందరు తొందరపడుతున్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఇది కలిసొచ్చే కాలం అనే చెప్పాలి. ప్రస్తుతం తర్లుపాడు రోడ్డులోని శ్రీ అల్లూరి పోలేరమ్మ దేవాలయం ప్రాంతంలో రియల్ఎస్టేట్ వ్యాపారం జరుగుతోంది. ఆ తరువాత రాయవరం, ఎస్టేట్ ప్రాంతంలోనూ వ్యాపారం జరుగుతోంది. ఆయా ప్రాంతాల్లో ప్రభుత్వ భూములున్నాయి. ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఒకటి, రెండు అక్కడక్కడా ఏర్పాటయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిసింది. పట్టణంలో గజం స్థలం ఖరీదు రూ.50 వేల నుంచి రూ.లక్షకు ▶ 5లో



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలను
జయప్రదం చేయాలి

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ ▶ 8లో

'అద్దంకి' పోయే..
ఆదాయమూ పోయే.!



- మళ్లీ ప్రకాశం జిల్లాలోకి వెళ్లనున్న 'నియోజకవర్గం..'
- గ్రానైట్ పరిశ్రమల ద్వారా వచ్చే ఆదాయాన్ని కోల్పోనున్న బాపట్ల జిల్లా

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో భాగంగా ఉన్న అద్దంకి నియోజకవర్గం జిల్లాల పునర్విభజన కారణంగా మళ్లీ ప్రకాశం జిల్లాలో విలీనం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.. ఈ క్రమంలో ఇప్పటివరకు జిల్లా పరిధిలో చేరి ఉన్న గ్రానైట్ క్వారీలు, వాటి అనుబంధ పరిశ్రమల నుంచి వచ్చే సీనరేజ్ ద్వారా వస్తున్న కోట్ల రూపాయల ఆదాయాన్ని బాపట్ల జిల్లా కోల్పోనుంది. బాపట్ల కేంద్రంగా జిల్లా అయితే ఏర్పడింది గానీ రాష్ట్రప్రభుత్వం నుంచి తగినంతగా నిధులు విడుదల కాక వెనుకబడిన జిల్లాగా బాపట్ల ఉంది. ఇప్పటివరకు జిల్లాకు ఉన్న ప్రధాన ఆర్థిక వనరు జిల్లా పరిధిలో ఉన్న గ్రానైట్ క్వారీలు, పరిశ్రమలు. ఇది తప్ప ఆదాయం వచ్చే వనరులేవీ జిల్లాకు లేవు. జిల్లాలో ఉన్న సముద్రతీరాన్ని ఉపయోగించుకుని ఆదాయ మార్గాలను పెంచుకోవలసిన ఉంది. ఈ తరుణంలో జిల్లా అద్దంకి నియోజకవర్గాన్ని కోల్పోవడంతో ఆర్థికంగా మరింత వెనుకబాటుకు గురికానుంది.

గత వైసిపి ప్రభుత్వ హయాంలో పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికన బాపట్ల జిల్లా ఏర్పడింది. అయితే బాపట్ల పార్లమెంట్ పరిధిలో ఉన్న సంతనూతలపాడు నియోజకవర్గం ఒంగోలుకు ▶ 5లో

మా పెళ్లికి..
కులమే అడ్డమంట.!

- 'ఇన్‌స్టాగ్రామ్' ప్రేమకు బలైన యువతి
- ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్య



నళిని (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

'ఒకప్పుడు నేను లేకపోతే బతకలేను అన్నాడు.. ఇప్పుడు నేను చనిపోతానంటున్నా పట్టించుకోను అంటున్నాడు.. ప్రేమించుకొనేటప్పుడు మా కులాలు వేరని తెలుసు.. కానీ ఇప్పుడు మా పెళ్లికి కులమే అడ్డం అంటున్నాడు.. తను నా జీవితంలో లేడు.. కాబట్టి నాకు ఈ జీవితమే వద్దు ..' అని సూసైడ్ నోట్ రాసి.. ఓ యువతి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన ఒంగోలు నగరంలోని కబాడీపాలెంలో ఆదివారం జరిగింది.

ఒంగోలు నగరంలోని కబాడీపాలెంకి చెందిన మైరాల నళిని (26)కి, ఒంగోలు, మహేంద్రనగర్‌కి చెందిన శింగోతు శ్రీనివాస రావుకు పది సంవత్సరాల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైంది. నళిని యంటెక్ చదువు పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉంది.. ఇటీవల నళిని శ్రీనివాస రావుని కలిసి తన చదువు పూర్తయిందని, పెళ్లి చేసుకుందామని అని అడగగా 'నీ కులం వేరు నా కులం వేరు.. మన పెళ్ళికి మా ఇంట్లో వాళ్లు అంగీకరించరు' అని చెప్పినట్లు తెలిసింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నళిని.. కులాలు వేరని శ్రీనివాస్ తనతో పెళ్లికి ఒప్పుకోవడం లేదని, అతను తన ప్రాణం కంటే ఎక్కువని, అతను తన జీవితంలో లేకపోతే తనకు ఈ జీవితమే వద్దని సూసైడ్ నోట్ రాసింది. 'ఆల్ ది బెస్ట్ శ్రీనివాస్. ఐ లవ్ యు హబ్బీ. ఐ మిస్ యు శ్రీను. గుడ్ బై' అని అందులో పేర్కొని.. ఇంట్లో చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. కాసేపటికి ఇంటికి వచ్చిన ఆమె తండ్రి ఎంతసేపు పిలిచినా తలుపులు తెరవకపోవటంతో చుట్టుపక్కల వారిని పిలిచారు. వారు వచ్చి తలుపులు బద్దలు కొట్టగా.. ▶ 5లో

నేటి రాజకీయాలు అవినీతిమయం

ప్రజాశక్తి-మార్కాపురం

నేటి రాజకీయాలు అవినీతిమయంగా మారాయని వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు కెఎం అబ్దుల్ సుభాన్ అన్నారు. ప్రకాశం జిల్లా మార్కాపురం పర్యటన సందర్భంగా స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఆదివారం ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రంగాలను ప్రైవేటుపరం చేస్తూన్నాయని, అందులో భాగంగా ఇండిగో సంస్థను కూడా ప్రైవేటుపరం చేసిందని, కేంద్ర ప్రభుత్వం ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సికేర్ రివిజన్ ఎస్ఐఆర్‌ను ఉపయోగించి తమకు అనుకూలంగా ఉన్న ఓటర్లను మాత్రమే పెట్టుకునేందుకు పన్నిన కుట్రలో భాగమే అని ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్లను తొలగింపు ఒత్తిడితో దేశవ్యాప్తంగా 47 మంది బిఎల్వోలు ఆత్మహత్య చేసుకున్నారని, రాబోయే స్థానిక ఎన్నికలే ధ్యేయంగా పార్టీ పనిచేస్తుందని అన్నారు. అవకాశం, బలాన్ని బట్టి ఎన్నికల్లో నిలబడతామని చెప్పారు. వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా విలువలతో కూడిన రాజకీయం చేస్తుందని, అందుకోసం ప్రజలను చైతన్యవంతులను చేస్తుందని అన్నారు. ఈ సందర్భంగా మార్కాపురం వెల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియాలో కొంతమంది పార్టీలో చేరి కండువా కప్పుకున్నారు. పార్టీ మార్కాపురం పట్టణ కన్వీనర్‌గా షేక్ అబ్దుల్ రసూల్, కో కన్వీనర్లుగా షేక్ ఖాజా, షేక్ మస్తాన్‌వలి లను నియమించినట్లు తెలిపారు.

బైరెడ్డి శబరికి కృతజ్ఞతలు

ప్రజాశక్తి-మార్కాపురం

వాల్మీకుల ఎస్‌టి రిజర్వేషన్ పునరుద్ధరణ అంశంపై పార్లమెంట్‌లో మాట్లాడిన పార్లమెంట్ సభ్యులు బైరెడ్డి శబరికి వాల్మీకి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. యూనియన్ సమావేశం ఆదివారం స్థానిక ఎన్ఎస్ నగర్‌లోని సరస్వతి కోచింగ్ సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు జీవనోపాధి, ఉద్యోగ అవకాశాల కల్పన, మంచి భవిష్యత్తు కల్పించే విధంగా వాల్మీకులు ఐక్యంగా పోరాడాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర, జిల్లా వాల్మీకి ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు స్పందించి, కార్యవర్గాలను విస్తతంగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సమావేశంలో గిద్దలూరు, కొనకనమిట్ల మండల విద్యాశాఖాధికారులు నల్లబోతుల అశ్వినికుమార్, బరిగె నరసింహారావు, ఉపాధ్యాయ నాయకులు మండ్ల రామాంజనేయులు, మండ్ల వెంకటేశ్వర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-రాచర్ల : రాచర్ల మండలం ఆకవీడు, జెపి చెరువు 33/11 విద్యుత్ సబ్ స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపిసిపిడిసిఎల్ ఏఈ కె బాలగురవయ్య తెలిపారు. ఆర్డీఎస్ మరమ్మతుల పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిలిపివేస్తున్నామని, ప్రజలందరూ దీనిని గమనించి సహకరించాలని ఏఈ బాల గురవయ్య కోరారు.



సంతకాల సేకరణలో వైసిపి నాయకులు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి : వైపిపి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

ప్రభుత్వ వైద్య విద్యపై చంద్రబాబు సర్కార్ కుట్ర చేస్తోందని వైసీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి అన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసీపీ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం సంతనూతలపాడులోని బస్టాండ్ సెంటర్, పలు కాలనీల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చెంచిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద విద్యార్థులకు వైద్య విద్యను అందుబాటులోకి తేవాలన్న సంకల్పంతో మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తే, నేడు సీఎం చంద్రబాబు ప్రభుత్వ వైద్య విద్యను పీపీపీ పేరుతో టీడీపీ సానుభూతిపరులకు, కార్పొరేటర్లకు దోచిపెడుతున్నార న్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వానికి రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమం పట్టడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వారిపై దాడులు, అక్రమ కేసులు పెడుతున్నారు తప్ప ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ డైరెక్టర్ మోహన్‌రావు, నాగాంజనేయులు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలో అసమ్మతి రాగం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం



మాట్లాడుతున్న డాక్టర్ మన్నే రవీంద్ర

యర్రగొండపాలెం టిడిపిలో అసమ్మతి రాగం వినిపిస్తోంది. ప్రస్తుత పార్టీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబుపై టిడిపిలోని ఓ గ్రూపు విమర్శలు చేస్తోంది. ఆదివారం ఏకంగా ప్రెస్‌మీట్ కూడా పెట్టింది. ఎర్రగొండపాలెం నియోజకవర్గం వైసీపీకి పట్టుకొమ్మని అనేవారని, దాని మెజారిటీని 32 వేల నుంచి 5 వేలకు మెజార్టీని తగ్గించామని, ప్రస్తుతం పార్టీ పూర్తిస్థాయిలో భ్రష్టు పట్టిందని పలువురు టిడిపి నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం పట్టణంలోని మన్నే రవీంద్ర వైద్యశాలలో జరిగిన విలేకరుల సమావేశంలో టిడిపి నాయకుడు డాక్టర్ మన్నే రవీంద్ర ఆధ్వర్యంలో వారు మాట్లాడుతూ ఎర్రగొండపాలెం నియోజకవర్గంలో ఇన్‌ఛార్జి పనితీరు వివాదాస్పదంగా మారిందని అన్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారం చేపట్టిన అనంతరం ఆయన పనితీరు మాత్రం తానే రాజు తానే మంత్రి అన్న రీతిలో వ్యవహరిస్తూ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలలో అధికారులు సైతం ప్రజల సమస్యలను పట్టించుకునే పరిస్థితి లేదన్నారు. పలుమార్లు తెలియజేసినా అధిష్టానం సైతం పట్టించుకోవడం లేదని వారు తమ బాధను వ్యక్తం చేశారు. కనిగిరి నుంచి కేవలం నియోజకవర్గం ప్రజల అభీష్టం మేరకు మన్నె రవీంద్ర ఆశీస్సులతో ఇన్‌ఛార్జి పదవిని స్వీకరించిన ఎరిక్షన్‌బాబు రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టాక తన పని తీరును మార్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో ఈయనపై ఐదు మండలాల కార్యకర్తలతో అధిష్టానానికి వినతిపత్రం అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు షేక్ జిలాని, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పులి దాడిలో ఆవు మృతి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

గిద్దలూరు మండలం జయరాంపురం సమీప పొలాల్లో పులి సంచరిస్తున్నట్లు ప్రజలు గుర్తించారు. జయరాంపురం చెరువు పరిసర వరిమడుల బీడు భూముల్లో శనివారం మేత మేస్తున్న పశువుల మందలోని ఆవుపై పక్కనే చెట్ల చాటున దాగి ఉన్న పులి ఒక్కసారిగా దాడి చేసింది. ఈ విషయాన్ని గమనించిన చుట్టుపక్క పొలాల్లోని రైతులు, పశు కాపరులు బిగ్గరగా కేకలు వేయటంతో పులి అడవి పొదల్లోకి పారిపోయింది. పులి దాడిలో గాయపడ్డ ఆవును ఇంటికి తెచ్చి చికిత్స చేస్తుండగా ఆదివారం మరణించింది. రూ.40 వేల విలువైన తన కుటుంబానికి ఆసరాగా ఉన్న ఆవు మరణంతో రైతు ఎండూరు ఆనంద్ ఆవేదన వ్యక్తం చేశారు. అదే ప్రాంతంలో ఆదివారం మేక మందపై పడి ఒక మేకను పులి నోట కరచుకుని ఎత్తుకెళుతుంటే కాపరులు భయంతో చూస్తుండి పోయారు. దీంతో జయరాంపురం ప్రజలు పొలాల్లోకి వెళ్లాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. అటవీశాఖ అధికారులు ఈ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పులి సంచారాన్ని పర్యవేక్షిస్తున్నారు.

గాండ్ల సంక్షేమ సంఘ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పొదిలి

గాండ్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. పట్టణంలోని ఎన్‌జిఓ హోంలో రిజిస్టర్ నెంబర్ 366/2025తో పొదిలి యూనిట్‌కు కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా చిట్టెంశెట్టి వెంకట కృష్ణారావు, ప్రధాన కార్యదర్శిగా దాసరి గురుస్వామి, సహాధ్యక్షులుగా మాడిశెట్టి హారిక, సహ కార్యదర్శిగా చిట్టెంశెట్టి శ్రీనివాసులు, కోశాధికారిగా బూదాటి వెంకట నిమ్మేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా దుడ్డు శంకర్రావు, ముత్యాలపాటి రామారావు, ఆళ్లచెరువు విక్రమార్క్, చాకిరాల చంద్రకుమారిలను ఎన్నుకొని ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ సలహాదారులు తంగేళ్ల నాగభూషణం మాట్లాడుతూ గాండ్ల కార్పొరేషన్, కమ్యూనిటీ బిల్డింగ్ సాధించాలని అందుకోసం మనమంతా ఐకమత్యంగా ఉండాలని సూచించారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గాండ్ల సంక్షేమ సంఘం జిల్లా కోశాధికారి వరికుంట్ల హనుమంతరావు, యూత్ కన్వీనర్ బోయిళ్ల రోషన్‌బాబు, చిట్టెంశెట్టి వెంకట సుబ్బారావు, దుడ్డు హరి, గుంటిక కృష్ణ, ఫణి, మాధవి, అనూష, వరికుంట్ల వెంకటేశ్వర్లు, బూదాటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No:103/2014

తిరువీధుల శివపార్వతి ...... వాది

Vs

ముప్వా పున్నమ్మ వగైరాలు ..... ప్రతివాదులు

దావా సమను

To

D3) ముప్వా రాఘవయ్య S/o రామయ్య
రావినూతల గ్రామం, కొరిశపాడు మండలం, బాపట్ల జిల్లా.

వాది తన తాలుకు రావినూతల గ్రామ సర్వేనెంబర్ 57/2లోని య.0.78 సెంట్ల భూమి విషయమై తనకు హక్కు నిర్ధారణ చేసి శాశ్వతముగా ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచూ పైదావా మీపై దాఖలు చేయగా మీ నోటీసు నిమిత్తం తేది 19-12-2025 కి వాయిదా వేయబడినది. కావున పై దావా పై మీ అభ్యంతరములు ఏమైనా ఉంటే అట్టివి పై తేదీన పైకోర్టు ఎదుట ఉదయం10.30ని:లకు స్వయముగా హాజరై తెలుపుకొనగలరు. లేనిచో దావా మీ పరోక్ష ముందు తీర్మానం కాగలదు.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

అద్దంకి ఇట్లు
తేది :07-12-2025 వెలగపూడి సుబ్రహ్మణ్యం
B.A. B. L
వాది తరుపు న్యాయవాది

ఒరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

విద్యుత్ శాఖ స్పందించాలని ప్రజల విజ్ఞప్తి

ప్రజాశక్తి-పెద్దారవీడు

మండలంలోని ఎస్ కొత్తపల్లి చెరువుకట్టపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచివుంది. చెరువు కట్టపై శ్రీశైలం, కర్నూలు ప్రాంతాలకు వెళ్లేందుకు ప్రధాన రహదారి కూడా ఉంది. రహదారికి ఇరువైపులా ఎస్ కొత్తపల్లి (దేవరాజుగట్టు) నకు చెందిన అత్తా కోడళ్ల చెరువులు ఉన్నాయి. రహదారికి దక్షిణం వైపున ఒక చెరువు, ఉత్తరం వైపున మరో చెరువు ఉంది. చెరువు కట్టపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చాలా కాలం క్రితం ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ ఇంతగా వర్షపు నీరు చేరలేదు. ప్రస్తుతం ఆ రెండు చెరువుల్లో నీరు పుష్కలంగా ఉంది. ఈ క్రమంలో చెరువు గట్టు అంచులో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా చెరువులోకి ఒరిగింది. ఒరిగిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ పైన తీగల ఆధారంతో ఉంది. ట్రాన్స్‌పార్మర్ బరువుకు ఆ తీగలు ఎప్పుడైనా తెగిపడే ప్రమాదం ఉంది. ఇదే ట్రాన్స్‌ఫార్మర్ నుంచి రహదారికి అటుఇటుగా లైన్‌లు ఉన్నాయి. చెరువు గట్టుపై ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ నీటిలో పడిపోతే రహదారిపై మరికొన్ని విద్యుత్ లైన్‌లు తెగిపడే ప్రమాదం లేకపోలేదు. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారిలో జరగరానిది ఏదైనా జరిగిందంటే పెద్ద ప్రమాదమే సంభవించనుంది. నిత్యం అధికారులు ఇదే మార్గంలో ప్రయాణిస్తున్నా ప్రమాదాన్ని పసిగట్టకపోవడం విడ్డూరంగా ఉందని జనం విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పడిపోకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



ఒరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఇదే

మహారాజ శ్రీ గిద్దలూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 186/2025

సూరె నాగేశ్వరరావు ..వాది

ఎదిరి

పువ్వాడ లక్ష్మణ .. ప్రతివాది

టు,

ప్రతివాది చిరునామా

పువ్వాడ లక్ష్మణ తండ్రి లేట్ లక్ష్మి నారాయణ,
డోర్ నెం. 15/51, కాప వీధి, కంభం గ్రామం
మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు దావాలో దావా మొత్తం, దావా ఖర్చులు, వడ్డీ వగైరాలు రాగోరి వాది, ప్రతివాది, పైన దావాను దాఖలు చేసియున్నాడు. సదరు విషయమై ప్రతివాదికి ఎమైనా ఆక్షేపనలు ఉండిన యడల 09-12-2025వతేది ఉదయం 10:30 గంటలకు పై కోర్టువారి ఎదుట హాజరై నీ ఆక్షేపనలు తెలుపుకొనవలెను. లేని యెడల నీపరోక్ష మందు దావాను విమర్శించి తీర్మాణించబడునని నీకు తెలియజేయడమైనది.

// కోర్టు వారి అనుమతిన //

గిద్దలూరు,
తేది: 07-12-2025 ఇట్లు
శ్రీ ఉదయగిరి మల్లిఖార్జునరావు,
వాది పరం అడ్వకేటు.

అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No:103/2014

తిరువీధుల శివపార్వతి ...... వాది

Vs

ముప్వా పున్నమ్మ వగైరాలు ..... ప్రతివాదులు

దావా సమను

To

D8) మారెళ్ళ శేషమ్మ W/o వెంకట్రావు
మారెళ్ళవారిపాలెం, మద్దిపాడు మండలం
ప్రకాశం జిల్లా.

వాది తన తాలుకు రావినూతల గ్రామ సర్వేనెంబర్ 57/2లోని య.0.78 సెంట్ల భూమి విషయమై తనకు హక్కు నిర్ధారణ చేయమని, మరియు శాశ్వత ఇంజక్షన్ ఉత్తర్వులు కోరుచూ పై దావా మీపై దాఖలు చేయగా మీ నోటీసు నిమిత్తం తేది 19-12-2025కి వాయిదా వేసినారు. కావున పై దావా పై మీ అభ్యంతరములు ఏమైనా ఉంటే అట్టివి పై తేదీన పైకోర్టు ఎదుట ఉదయం10.30 ని : లకు స్వయముగా హాజరై తెలుపుకొనగలరు. లేనిచో దావా మీ పరోక్షముందు తీర్మానం కాగలదు.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో //

అద్దంకి ఇట్లు
తేది :07-12-2025 వెలగపూడి సుబ్రహ్మణ్యం
B.A. B. L
వాది తరుపు న్యాయవాది

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - కనిగిరి

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన అధ్యక్ష కార్యదర్శులుగా కె.విజయ్, బి.వీరస్వామి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జడేజా,అమర్నాథ్‌రెడ్డి,పాండు రంగారావు, దేవరాజు, రామిరెడ్డితో పాటు 15 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వ ఆధీనంలోనే నిర్మించాలన్నారు.ప్రకాశం జిల్లాకు కేటాయించిన యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటి కళాశాల, దర్శి, ఎర్రగొండపాలెం మోడల్ డిగ్రీ కాలేజీల నిర్మాణం చేపట్టాలన్నారు. అర్హులైన విద్యార్థులందరికీ షరతులు లేకుండా తల్లికి వందనం ఇవ్వాలన్నారు.పెండింగ్‌లో వున్న ఫీజు రీయింబర్స్ నిధులు విడుదల చేయాలన్నారు. జీవో నెంబర్ 77రద్దు చేసి పిజికి రీయింబర్స్ మెంట్ వర్తింపజేయాలన్నారు.సంక్షేమ హాస్టళ్ళకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు 3వేలకు పెంచాలని, వార్డెన్, సిబ్బంది, ట్యూటర్ పోస్టులు భర్తీ చేసి, సొంత భవనాలు నిర్మించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విలీనాలను ఆపాలని, కార్పొరేట్ విద్యాసంస్థలను నియంత్రించాలన్నారు .ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులందరికీ ఉచితంగా బస్సు పాసులు ఇవ్వాలన్నారు.మార్కాపురం, గిద్దలూరులో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేయాలన్నారు. ఒంగోలులో ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల, చీమకుర్తిలో మైనింగ్ యూనివర్సిటీ, దర్శిలో డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు చేయాలన్నారు. డ్రగ్స్, గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు.


కె.విజయ్


బి వీరస్వామి

ప్రభుత్వం యాంటి డ్రగ్స్ కార్యక్రమం నిర్వహించాలన్నారు. తీర్మానాల ఆచరణ కోసం భవిష్యత్ కార్యాచరణ సిద్ధం చేసి పోరాటాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.


మహా నైవేద్యం అందజేస్తున్న భక్తులు

ఆలయంలో ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-సిఎస్‌పురం

ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి నారాయణస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు పంచామత అభిషేకాలు, హోమాలు, మహా నైవేథ్యం, గోపూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ పాములపాటి మాధవ్‌ప్రసాద్ సతీసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. మహా నైవేథ్యాన్ని భక్తులకు అందజేశారు. అనంతరం స్వామివారి రథోత్సవం, పల్లకి సేవ నిర్వహించారు. ఆలయ ఇఒ గిరిరాజు నరసింహ బాబు, వ్యవస్థాపక చైర్మన్ కొమినేనిచిన ఆదినారాయణ ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. ఉచిత అన్నదానం చేపట్టారు. ఈ కార్యక్రమలో ఆలయ అధికారులు, సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-కొండపి

కొండపి మండలం కె.ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1975-76 పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. 50 సంవత్సరాల తర్వాత అపూర్వంగా కలుసుకున్నారు. అప్పటి జ్ఞాపకాలు, గత స్మృతులను నెమరు వేసుకుంటూ ఆనందంగా, ఉల్లాసంగా, ఉత్సాహంగా గడిపారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు చుండి శంకరరావు,పెద్దిరెడ్డి గోపాల్ రెడ్డి,వాక హరిచంద్ర రెడ్డి మాట్లాడుతూ 50 సంవత్సరాల తర్వాత తామంతా ఒకే వేదికపైకి చేరడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం అప్పట్లో తమ చదువు చెప్పిన గురువులను సన్మానించారు. అదేవిధంగా ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు వి.సుసన్న కుమార్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ రాఘవేంద్ర శర్మను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్కడ 'ఆయనే' బాస్

తోటి సిబ్బందిని వేధిస్తున్న వైనం

ప్రజాశక్తి-పామూరు

ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసుల మధ్య వర్గ పోరు నడుస్తోంది. పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదులను సిఐ కార్యాలయంలో విచారిస్తున్నారు.తమ కార్యాలయం పనిచేస్తున్న కానిస్టేబుల్ అశోక్ అనే కానిస్టేబుల్‌కు సిఐ ఈ బాధ్యత అప్పగించారు. దీంతో అశోక్, స్థానిక పోలీసు సిబ్బంది మధ్య పోరు సాగుతోంది. అశోక్ తన కనుసన్నల్లో పనిచేయాలని ఎస్ఐ, కానిస్టేబుళ్లపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో పామూరు ఎస్ఐ సెలవుపై వెళ్లినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. ఏదైనా పనికోసం సిఐ కార్యాలయానికి వెళ్లితే మీరు పార్టీ వారు అని అడుగుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. కానిస్టేబుల్ అశోక్ తీరు వల్లే పోలీసుల మధ్య వర్గ పోరు తారా స్థాయికి చేరింది. ఈ విషయం గురించి తెలుసుకున్న కనిగిరి డిఎస్‌పి సాయి ఈశ్వర్ యశ్వంత్ కానిస్టేబుల్ అశోక్‌ను తన కార్యాలయానికి పిలిపించి మందలించి ట్రాఫిక్ విధులకు పంపినట్లు సమాచారం. అయితే అశోక్ విధులకు హాజరు కాకుండా సెలవులో వెళ్లినట్లు తెలిసింది. రాజకీయ అండతో తిరిగి సిఐ కార్యాలయంలోనే విధుల్లో చేరాలని అశోక్ పట్టుదలతో ఉన్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. పామూరు ఎస్ఐ జీబు డ్రైవర్ ప్రైవేటు వ్యక్తి కావడంతో సిఐ అతడిని తొలగించినట్లు తెలిసింది. జీప్ డ్రైవర్ లేక ఇబ్బందులు పడలేక ఎస్ఐ సెలవులో ప్రజలు చర్చించుకుంటున్నారు. పోలీసుల వర్గ పోరుగురించి డిఎస్‌పిని వివరణ కోరగా ఇరువర్గాల పోలీసు సిబ్బందిని పలిపించి సమస్యను పరిష్కరించినట్లు తలెఇపారు. పోలీసుల మధ్య మళ్లీ మనస్పర్ధలు వస్తే వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే సహించేది లేదని తెలిపారు. ఎస్ఐ త్వరలోనే విధులకు హాజరవుతారని తెలిపారు. సమస్యను ఎస్‌పి దష్టికి తీసుకెళ్తామని డిఎస్‌పి తెలిపారు.



పామూరు సిఐ కార్యాలయం

కస్తూరిబా గాంధీ పాఠశాలలో డిఇఒ తనిఖీ

ప్రజాశక్తి- కనిగిరి

కనిగిరి పట్టణంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి కిరణ్ కుమార్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన మెనూ పరిశీలించారు. అనంతరం భోజనం చేశారు. 7 ,9 తరగతుల విద్యార్థుల హ్యాండ్ రైటింగ్‌ను పరిశీలించి వారిని మెచ్చుకున్నారు. పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు కొనసాగుతున్న స్టడీ అవర్స్‌ను పరిశీలించారు. బాగా చదివి రానున్న పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని బాలికలకు సూచించారు. డిఇఒ వెంట కనిగిరి, పెదచెర్లోపల్లి, వెలిగండ్ల ఎంఇఒలు నారాయణరెడ్డి సంజీవి, శ్రీనివాసచారి, రామిరెడ్డి, కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ఎస్ఒ హసీనా బేగం, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ కిరణ్‌కుమార్

ఆకట్టుకున్న మహిళల కోలాటం

ప్రజాశక్తి-దర్శి

దర్శిపట్టణంలోని అద్దంకి రోడ్డులో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారి ఊరేగింపు ఆదివారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు మారం శివకోటిరెడ్డి, అర్చకుల ఆధ్వర్యంలో పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో మహళలు, నిర్వాహకులు తదితరులు


కోటాటం ప్రదర్శిస్తున్న మహిళలు


గాయపడిన గురువేంద్ర

అదుపుతప్పి బైకు బోల్తా.. ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి -సిఎస్‌పురంరూరల్

ప్రమాద వశాత్తు బైకు బోల్తా కొట్టిన ఘటనలో ఓ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. మరో ఇద్దరు విద్యార్థినుల ఎస్వల్పంగా గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని కంభంపాడు సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం... పామూరు మండలం బుక్కాపురం గ్రామానికి చెందిన గురువేంద్ర మరో ఇద్దరు విద్యార్థులు సిఎస్‌పురం మండలం సి.నాగులవరం జడ్‌పిహెచ్ఎస్‌లో పదవ తరగతి చదువుతున్నారు. స్టడీ అవర్స్ కోసం బైకుపై పాఠశాలకు వచ్చారు. స్టడీ అవర్స్ ముగిసిన తర్వాత ఇంటికి వెళుతుండగా కంభంపాడు సమీపంలో బైకు అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో గురువేంద్రకు తీవ్ర గాయాలు అయ్యాడు. ఇద్దరు విద్యార్థినులకు స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన గురువేంద్రను పామూరు వైద్యశాలకు తరలించారు.అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కనిగిరి హాస్పిటల్‌కు తరలించారు.


దాడిలో గాయపడిన చిన్న రంగయ్య

వ్యక్తిపై గొడ్డలితో దాడి

ప్రజాశక్తి-బేస్తవారిపేట

బేస్తవారిపేట మండలం పూసలపాడు గ్రామంలో ఆదివారం బొగ్గు చిన్న రంగయ్య అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన వడ్డే లాజర్ అనే వ్యక్తి గొడ్డలితో దాడి చేశారు. ఈ దాడిలో చిన్న రంగయ్యకు మోచేతి వద్ద తీవ్ర గాయమై అధిక రక్తస్రావం అయినట్లు రంగయ్య కుటుంబ సభ్యులు తెలిపారు. గాయపడిన రంగయ్యను కంభం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు ఆయనకు వైద్యం అందించి పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ గొడవకు కారణాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై బేస్తవారిపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట చెరువు కట్ట వద్ద కూచిపూడి గ్రామానికి చెందిన జి పుల్లారెడ్డి (35) అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతను తన మోటార్ సైకిల్‌పై ఈ ప్రాంతానికి చేరుకొని ఒక వైరుతో తాను చెట్టుకు కట్టుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఒంగోలు తాలూకా సబ్ ఇన్‌స్పెక్టర్ హరిబాబు సంఘటనా ప్రాంతాన్ని పరిశీలించి మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

సిఐటియు మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


సిఐటియు పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిహెచ్ మజుందార్

ప్రజాశక్తి - అద్దంకి

సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు డిసెంబర్ 31 నుంచి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో మహాసభల ముగింపు రోజు జనవరి 4న భారీ ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ తెలిపారు. స్థానిక సుందరయ్య భవనం సిఐటియు కార్యాలయంలో మహాసభల పోస్టర్‌ను ఆయన ఆదివారం ఆవిష్కరించారు. ఎన్నో త్యాగాల ఫలితంగా పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం రద్దు చేసి కార్మిక హక్కులు కాలరాసే విధంగా లేబర్ కోడ్ బిల్లును తీసుకొచ్చిందని అన్నారు. కార్మికుల గొంతు నొక్కే విధానాన్ని అవలంబిస్తుందని అన్నారు. వీటి వల్ల కార్మిక ప్రయోజనాల కన్నా కార్మిక వర్గ వినాశనానికి దారి తీస్తుందని అన్నారు. వెంటనే ఈ లేబర్ కోడ్ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మొట్ట మొదటగా ఆంధ్ర రాష్ట్రంలో సిఐటియు జాతీయ మహాసభలు ఐదు రోజులు పాటు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉక్కు నగరమైన విశాఖపట్నంలో జరుగుతున్న మహాసభలకు ప్రత్యేకత ఉందని అన్నారు. కార్మిక వర్గంపై జరుగుతున్న దాడిని తిప్పుకొట్టే విధంగా కార్మిక వర్గం ఐక్య పోరాటాలు నిర్వహించేందుకు మహాసభలు వేదిక కానున్నట్లు చెప్పారు. మహాసభల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల కన్వీనర్ తంగిరాల వెంకటేశ్వర్లు, కో కన్వీనర్ పి తిరుపతిరెడ్డి, సిఐటియు నాయకులు జి శారదా, ఉసిరిపాటి సామ్యూల్, రావులపల్లి కోటేశ్వరావు, మున్నంగి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పంగులూరు : విశాఖపట్నంలో జరిగే సిఐటియు అఖిలభారత 18వ మహాసభలకు ప్రజలు తరలిరావాలని సిఐటియు మండల కార్యదర్శి గుడిపాటి మల్లారెడ్డి కోరారు. మండలంలోని బైటమంజులూరులో సిఐటియు మహాసభల కరపత్రాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కార్మిక రంగంపై ప్రభుత్వాలు దాడి చేస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ రంగాలన్నింటినీ ప్రైవేటీకరించే ప్రయత్నంలో ఉన్నాయని అన్నారు. అదాని, అంబానీ సేవలోనే మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. దేశ సంపద వారికి ధారాదత్తం చేస్తుందని అన్నారు. కోట్లాదిమంది కార్మికుల నోళ్లు కొట్టి కలిగినోళ్ళకు కట్టబెట్టే ప్రయత్నంలో విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ వంటి అనేక సంస్థలను ప్రభుత్వం వాళ్లకు కట్టబెడుతుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కార్మికుల హక్కులు, చట్టాలను రద్దు చేస్తూ లేబర్ కోడ్స్ తీసుకువచ్చిందని అన్నారు. దీనివలన కార్మిక రంగానికే కాకుండా యావత్ భారతదేశానికి ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ లేబర్ కోడ్లను రద్దు చేసే వరకు పోరాటం చేయాల్సిన బాధ్యత కార్మిక రంగంపై ఉందని అన్నారు. కార్మికులను సంఘటితం చేసి పోరాటం వైపు తీసుకువెళ్లాలని అన్నారు. దేశంలోని కార్మికులందరినీ ఐక్యచేసే పనిలో సిఐటియు ఉందని అన్నారు. సిఐటియు మహాసభలు జయప్రదం చేయటం ద్వారా ప్రభుత్వానికి ఒక హెచ్చరిక చేయాలని అన్నారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో మార్పులు తీసుకురావడం ద్వారా రైతాంగానికే కాకుండా కార్మికులు, వ్యవసాయ కార్మికులకు కూడా సమస్యలు ఎదురవుతున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో జరిగే సిఐటియు మహాసభలు విజయవంతం చేయడానికి ప్రజలంతా కదలాలని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి పూసపాటి సుబ్బరాజు మాట్లాడుతూ కార్మికులు, కర్షకులు ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. అందుకు సిఐటియు వేదిక కావాలని కోరారు. అంతకు ముందు సిఐటియు 18వ అఖిలభారత మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిఐటియు బైటమంజులూరు గ్రామ కమిటీ కార్యదర్శి దేనువకొండ ఆదిశేషంరాజు, కుంచాల నరసయ్య, డి అంజంరాజు, ఎస్ శ్రీనివాసరాజు, బి పుల్లంరాజు, ఎస్ ఆనందరాజు పాల్గొన్నారు.


సిఐటియు కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

యుటిఎఫ్ నేత సుబ్రహ్మణ్యంకు ఘన నివాళి


మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు డి రమాదేవి

ప్రజాశక్తి - నగరం

సమాజ శ్రేయసు కోసం ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా ఉద్యమాల్లో అకింతభావంతో పని చేసిన ఎవిపికె సుబ్రహ్మణ్యం అనారోగ్యంతో మరణించడం బాధాకరమని సిపిఎం కేంద్రకమిటి సభ్యులు డి రమాదేవి అన్నారు. విశ్రాంత ఉపాధ్యాయుడు, యుటిఎఫ్ సీనియర్ నాయకులు, సిపిఎం కార్యకర్త సుబ్రహ్మణ్యం మృతదేహానికి ఆమె నివాళులర్పించారు. ఉపాధ్యాయ, కార్మిక, సిపిఎం నేతలు యుటిఎఫ్ జెండా కప్పి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో నేను, నా కుటుంబం అనుకుంటు ఆస్తులు పోగేసుకొనే తరుణంలో ఉపాధ్యాయ వృత్తిలో పనిచేస్తూ కార్మిక, మధ్యతరగతి ఉపాధ్యాయ సమస్యలపై అంకితభావంతో సుబ్రహ్మణ్యం పనిచేశారని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ప్రజక్షేత్రంలో సిపిఎం కార్యకర్తగా పనిచేస్తున్నారని అన్నారు. నేటి సమాజంలో కమ్యూనిస్టులు మాత్రమే త్యాగాలు చేస్తూ ప్రజల కోసం నిలబడుతున్నారని అన్నారు. ఉన్నతమైన ఆశయాల కోసం పనిచేస్తున్నారని అన్నారు. సమాజ శ్రేయసుకోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, సిపిఎం ఉద్యమంలో భాగస్వామ్యమైన సుబ్రహ్మణ్యంకు ఘన నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ మణిలాల్, టి కృష్ణమోహన్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు కె సాయి ప్రసాద్, ఎంవి సుబ్రహ్మణ్యం, శివశంకర్, చెరుకుపల్లి ఎంఇఓ టి నవీన్, సిఐటియు నగరం మండలం నాయకులు ఎం చందర్రావు, జి మరియదాసు, ప్రజా సంఘాల నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, ఎం సత్యనారాయణ, పి మనోజ్, కెవి లక్ష్మణరావు, ముఠా, రిక్షా, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న సిపిఎం కేంద్రకమిటీ సభ్యులు డి రమాదేవి

అధ్వానంగా తాటిపర్తివారిపాలెం రోడ్డు

నూతన రోడ్డు నిర్మించాలని సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు, గంగవరం మెయిన్ రోడ్డు నుండి తాటిపర్తి వారిపాలెం వెళ్లే రోడ్డు అధ్వానంగా మారింది. ఆ రోడ్డు వెంటనే నిర్మాణం చేపట్టి ఆయా గ్రామాల ప్రజల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య ఆదివారం డిమాండ్ చేశారు. మండలంలోని తాటిపర్తి వారిపాలెం వచ్చిన సందర్భంగా ఆయన మాట్లాడారు. రోడ్డు దెబ్బతిని గుంటల మయమైంది. గత కొన్నేళ్లుగా ఆ రోడ్డు ఎలాంటి మరమ్మత్తులకు నోచుకోలేదు. గ్రామానికి రాకపోకలు సాగించేందుకు ఆ రోడ్డు ఒకటే కావడంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గత కొన్నేళుగా ప్రజలు ఇబ్బంది పడుతున్నా రోడ్డు బాగుచేసే నాథుడే కరువయ్యారని అన్నారు. గత ప్రభుత్వం రోడ్లను బాగు చేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం వస్తే ప్రజలకు సౌకర్యవంతమైన రోడ్లు వేస్తామని ఘనంగా హామీలు ఇచ్చారని గుర్తు చేశారు. అధికారానికి వచ్చి రెండేళ్లు కావస్తున్నా నేటికీ ఈ రోడ్డు గురించి పట్టించుకోలేదని అన్నారు. తక్షణమే రోడ్డు రిపేర్ చేయాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న రోడ్డును పరిశీలించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి యేషయ్య, కాకి జకరయ్య, కె గంగయ్య పాల్గొన్నారు.


రోడ్డు దుస్థితి చూపిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య


మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు పరామర్శిస్తున్న అశోక్ బాబు

మాజీ ఎంపీపీకి అశోక్‌బాబు పరామర్శ

ప్రజాశక్తి - భట్టిపోలు

మండలంలోని ఐలవరంకు చెందిన మాజీ ఎంపీపీ అందే వెంకటేశ్వరరావు అనారోగ్యంతో ఇంటి వద్దనే ఉంటుండగా వైసిపి ఇంచార్జ్ వరికూటి అశోక్ బాబు ఆదివారం పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు ఆకురాతి కోటయ్య అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు మాచర్ల తులసి రంగారావు, వీరేంద్ర, సంగబతుల వెంకటేశ్వర్లు, రామకృష?, గడ్డం శ్రీనివాసరావు, పప్పుల మాధవరావు, మాచర్ల హేమసుంద్రరావు, జొన్నదుల నిశాంత్, అందే మోహన్, పంచుమర్తి ప్రసాద్ పాల్గొన్నారు.


ఎన్నికైన ఎన్‌జిఒ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఎన్‌జిఒ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - నగరం

ఎపి ఎన్జీఒ అసోసియేషన్ చెరుకుపల్లి తాలూకా ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. ఎన్నికల అధికారిగా నరసింహారావు, సహాయ ఎన్నికల అధికారిగా అంకమరావు నిర్వహించారు. బి రాజేష్ పరిశీలకులుగా వ్యవహరించారు. ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షులు ఘంటసాల శ్రీనివాసరావు మాట్లాడారు. నూతన కార్యవర్గ సభ్యులను అభినందించారు. నూతన అధ్యక్షులు కె సాంబశివరావు (హెల్త్ డిపార్ట్మెంట్), కార్యదర్శి హరికృష? (సచివాలయం), అసోసియేట్ అధ్యక్షులు ఆర్ విజయ సారథి (వెటర్నరీ), పి శ్రీనివాసరావు, వేణుగోపాల్ (రెవిన్యూ) కలిపి 16 మందితో తాలూక యూనిట్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


దాత కొల్లా సుబాష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పాఠశాలకు బల్లలు బహుకరణ

ప్రజాశక్తి - పర్చూరు

పాఠశాలకు రూ.50 వేల విలువైన కుర్చీలు, టేబుళ్లను బహుకరించారు. స్థానిక బొమ్మల సెంటర్ సమీపంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మాజీ జెడ్‌పిటిసి కొల్లా సుభాష్ బాబు తన సతీమణి కొల్ల గంగాభవాని జ్ఞాపకార్థం కుర్చీలు, బల్లలను అందజేశారు. చాలాకాలంగా ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులకు కుర్చీలు, బల్లలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు ఉపాధ్యాయులు అడిగిన వెంటనే స్పందించిన ఆయన తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తన తోడ్పాటు ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. దాతల సహకారం సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు ఆయనను సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం నాగిరెడ్డి, మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు పాలపర్తి నాగమణి, ఉపాధ్యాయులు పోలిశెట్టి హనుమంతరావు, బి ప్రసాద్ బాబు, సిహెచ్ సుబ్బారావు, సృజన, శివశాస్త్రి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

21న విస్తృత కళా పురస్కారం

ప్రజాశక్తి - అద్దంకి

పుట్టంరాజు బుల్లెయ్య, రామలక్ష్మమ్మల చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న 'విస్తృత కళా పురస్కారం' కార్యక్రమం ఈ నెల 21న పుట్టంరాజు కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది పురస్కార గ్రహీతగా రంగస్థల, సినిమా నటుడు, గాయకుడు, అధ్యాపకులు డాక్టర్ అక్కిరాజు సుందరరామకృష్ణను ఎంపిక చేసినట్లు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి తెలిపారు.


ఎన్‌జిఒ అసోసియేషన్ తాలూకా యూనిట్ సభ్యులు

నేడు ఎన్‌జిఒ అసోసియేషన్ ఎన్నికలు

ప్రజాశక్తి - అద్దంకి

ఎన్జీజీఒ అసోసియేషన్ తాలూకా యూనిట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా 16 పదవులకు స్థానిక ఎన్జీఒ హోం వద్ద నేడు స్వీకరించనున్నట్లు ఎన్‌జిఒ అధ్యక్షులు జి కిరణ్‌కుమార్, కార్యదర్శి టి రమేష్‌బాబు తెలిపారు. ఎన్నికల్లో ఏ పదవికైనా అదే రోజు నామినేషన్స్ పరిశీలించి పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రదర్శిస్తారని తెలిపారు.

'శ్రీరామ్' ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న నూకసాని బాలాజీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వాకర్స్ ఆరోగ్య సంరక్షణలో భాగంగా శ్రీరామ్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఒంగోలు భాగ్యనగర్ 2వ లైన్ పార్కులో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో 150 మంది పేషెంట్లు పాల్గొని.. ఉచితంగా బిపి, షుగర్, థైరాయిడ్, ఈసీజీ, హెచ్.బి, ఎముకల పటుత్వ సాంద్రత పరీక్ష, పాదాల నరాల స్పర్శ పరీక్ష, ఊపిరితిత్తుల సామర్థ్యపు పరీక్షలు లాంటి సుమారు నాలుగు వేల రూపాయల విలువగల పరీక్షలు ఉచితంగా చేయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ, ఒంగోలు ఏఎంసి ఛైర్మన్ రాచగర్ల వెంకట్ రావు ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారిని హాస్పిటల్ వైద్యులు సత్కరించారు. ఈ వైద్య శిబిరంలో ఎముకలు, నరాలు, కీళ్ళ మార్పిడి శస్త్రచికిత్స నిపుణులు డాక్టర్ చాపల వంశీకృష్ణ, ప్రముఖ జనరల్ మెడిసిన్ అండ్ డయాబెటాలజీ వైద్య నిపుణులు సానల ధీరజ్ బాబు, రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొప్పోలు సౌమిత్ర పల్లవ్, ప్రముఖ దంత వైద్య నిపుణులు డాక్టర్ కగ్గా చైతన్య ప్రియ, కంటి వైద్య నిపుణులు డాక్టర్ సానల మహిత వైద్యసేవలందించారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 పరిధిలో సోమవారం ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నగరంలోని కర్నూలు రోడ్డు, శ్రీనగర్ కాలనీ, భారత్ పెట్రోల్ బంక్, మారుతి నగర్, ఆగ్జిలియం స్కూల్, ఎస్‌బిఐ, జెడ్ పి కాలనీ, శివప్రసాద్ కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, ముంగమూరు రోడ్డు, మర్రిచెట్టు కాలనీ, ప్రగతి నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని టౌన్ విద్యుత్ డి.ఇ.ఇ. కె.వి. పాండురంగారావు తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

– డి1 పరిధిలో 11 లాయర్ పేట ఫీడర్, మరియు 11 కెవి విఐపి ఫీడర్, 11 కెవి ఫిల్టర్ బెడ్ ఫీడర్‌లో మున్సిపల్ శాఖ వారు, అభివద్ధి పనుల్లో భాగంగా రంగారాయుడు చెరువుకు, తూర్పు వైపున ఉన్న మెయిన్ గేటు దగ్గర, టర్నింగ్‌లో అడ్డంగా ఉన్న చెట్లు తొలగించుట కోసం సోమవారం ఉదయం 7 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్ డిఇఇ కెవి.పాండురంగారావు తెలిపారు. మీరావాలి బేకరీ, గాంధీ పార్కు, మాంటిసోరి స్కూల్, కొండయ్య బంకు రోడ్డు, టెంపుల్ టవర్, సాయిబాబా టెంపుల్ వెనుక వైపు, రంగారాయుడు చెరువు టర్నింగ్, రైతు బజారు, సంఘం డైరీ లైన్, సాయిబాబా గుడి, లాయర్ పేట, విఐపి రోడ్ ఐ బాకో ఐస్ క్రీమ్ పార్లర్ , కళానికేతన్, మంగమూరు డొంక సిగ్నల్ పాయింట్ వరకు ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలపై చర్యలు తీసుకోవాలి..

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా ప్రభుత్వ-ప్రభుత్వ రంగ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ, బహుజన ఉద్యోగుల సంఘం జిల్లా స్థాయి సమావేశం ఆదివారం ఒంగోలు హైదరీ క్లబ్‌లో జరిగింది. అధ్యక్షుడు మిడసల నాగార్జున ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి వివిధ శాఖల ఉద్యోగులు హాజరయ్యారు. సమావేశంలో ఉద్యోగులు తమ రోజువారీ విధుల్లో ఎదుర్కొంటున్న వేధింపులు, అనేక శాఖల్లో ఆర్ఒఆర్ అమలు జరగకపోవడం, నియామకాల్లో ఫోకల్ పాయింట్స్ ఆదేశాలు పట్టించుకోకపోవడం వంటి సమస్యలను ప్రస్తావించారు. ఈ అంశాలపై జిల్లా వ్యాప్తంగా ఉద్యమ పంథాలో పనిచేసేందుకు కొత్త కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తేళ్ల అంజయ, ఉపాధ్యక్షులుగా నక్కా కాంతారావు, జి.అవినాష్, ప్రధాన కార్యదర్శిగా మిడసల నాగార్జున ఎన్నికయ్యారు.

మార్కాపురంలో రియల్ జోరు

(మొదటిపేజీ తరువాయి)

చేరింది. శివారు ప్రాంతంలోనూ రూ.10 వేలకు పైగా చ.గ. స్థలం ధర పలుకుతోంది. మార్కాపురం పట్టణ సమీపంలోని జాతీయ రహదారి–565కు ఇరువైపులా స్థలాల విలువ మరింతగా పెరిగింది. మొత్తంగా రియల్ ఎస్టేట్ రంగంలో వ్యాపారం జోరందుకోవడంతో ఇప్పటి వరకు పెట్టుబడులు పెట్టిన వారంతా సొమ్ము చేసుకునే అవకాశం దక్కింది. ఈ క్రమంలో రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ మొదలైతే ప్రభుత్వానికి కొంత ఆదాయం లభించనుంది.

మా పెళ్లికి.. కులమే అడ్డమంట.!

(మొదటిపేజీ తరువాయి)

నళిని ఉరికి వేలాడుతోంది. నళినిని కిందకు దించి పరిశీలించగా ఆమె అప్పటికే మతి చెందింది. మంచంపై ఆమె రాసిన సూసైడ్ నోట్ లభించింది. ఈ ఘటనపై ఒంగోలు ఒకటవ పట్టణ ఇన్స్పెక్టర్ వై.నాగరాజు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నారు. నళిని మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిజిహెచ్‌కి తరలించారు.

శ్రీనివాసరావును అరెస్టు చేయాలి

ప్రజా సంఘాల నేతలు బి.రఘురామ్, నీలం నాగేంద్రరావు

నళినిని ప్రేమ పేరుతో మోసం చేసి వివాహం చేసుకోవడానికి నిరాకరించి.. ఆమె బలవన్మరణానికి కారణమైన శ్రీనివాసరావు, అతని కుటుంబసభ్యులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి బి.రఘురాం దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నీలం నాగేంద్రరావు డిమాండ్ చేశారు.

బైక్‌ల చోరీ కేసులో

ముగ్గురు నిందితులు అరెస్ట్

- 37 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- ఎస్పీ బి.ఉమామహేశ్వర్ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో వరుసగా చోటుచేసుకున్న ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను బాపట్ల జిల్లా పోలీస్ యంత్రాంగం, సిసిఎస్ పోలీ సులు సంయుక్తంగా ఛేధించి, దొంగతనాలకు పాల్పడుతున్న వారిని అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదివారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కేసులకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. జిల్లాలో వరుసగా జరుగుతున్న ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ సవాలుగా తీసుకొని, బాపట్ల సిసి ఎస్ డిఎస్పీ పి. జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో సిసిఎస్ సిఐ ప్రేమయ్య, వారి సిబ్బంది, జిల్లా పోలీస్ యంత్రాంగంతో కలిపి రెండు ప్రత్యేక బందాలను ఏర్పాటు చేశారు. వారు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, సీసీ కెమెరాల ఆధారంగా వరుస కేసులను చాకచక్యంగా ఛేదించి, దొంగతనాలకు పాల్పడుతున్న వారిని అరెస్ట్ చేశారు. దొంగిలించబడిన రూ. 21.2 లక్షల విలువగల 37 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు.

గుంటూరు జిల్లా పొత్తూరు గ్రామానికి చెందిన కగ్గ సాంబశివరావు అలియాస్ ప్రేమిలి, చీరాల, పేరాల, గాంధీనగర్ యానాది సంఘంకు చెందిన దాసరి గోపిరాజు, దాసరి దుర్గారావులు ఈ బైక్ దొంగతనాలకు పాల్పడ్డారు. నిందితుడు కగ్గ సాంబశివరావు లారీ డ్రైవర్‌గా పనిచేస్తూ చెడు వ్యసనాలు, విలాసాలకు అలవాటు పడటం వల్ల వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో, గత రెండు సంవత్సరాలుగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఇళ్ల ముందర, ఆసుపత్రుల వద్ద పార్క్ చేసిన బైకులను దొంగతాళాలతో లాక్ తెరిచి దొంగతనం చేస్తూ వచ్చాడు. బాపట్ల, గుంటూరు, పల్నాడు, విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లాల్లో వరుస దొంగతనాలు చేసినట్లు విచారణలో తేలింది. దొంగతనం చేసిన వాహనాలను ఇతర జిల్లాల్లో విక్రయించేవాడు. ఇతడి మీద గతంలో ఎటువంటి కేసులూ లేవు. మొత్తం 33 బైకులను దొంగిలించినట్లు గుర్తించారు. బాపట్ల పట్టణ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు.దాసరి గోపిరాజు, దాసరి దుర్గారావు ఇద్దరూ అన్నదమ్ములు. చీరాల పరిసరాల్లో చీపురులు అమ్ముతూ జీవనం సాగిస్తున్నారు. సంపాదన సరిపోకపోవడంతో సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గత 6 నెలలుగా బైక్ దొంగతనాలకు పాల్పడుతున్నారు. చీరాల 1 టౌన్, అద్దంకి టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 4 ద్విచక్ర వాహనాలను దొంగిలించారు. చీరాల 1 టౌన్ పోలీసులు వారిని ఆదివారం అరెస్ట్ చేశారు. జిల్లా సిసిఎస్ పోలీసులు, జిల్లా పోలీస్ యంత్రాంగం కలిసి కేసులను ఛేదించి, బాపట్లలో సాంబశివరావును, చీరాలలో గోపి, దుర్గలను అరెస్ట్ చేశారు. మొత్తం ముగ్గురు ముద్దాయిల నుండి రూ. 21.2 లక్షల విలువగల 37 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఎస్పీ బి. ఉమామహేశ్వర్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాల దొంగతనాలను అరికట్టేందుకు ప్రత్యేక బందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గడిచిన వారం రోజుల్లో జిల్లా పోలీస్ యంత్రాంగం రూ. 40 లక్షల విలువ గల 60 బైకులను రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాహనాలకు సేఫ్టీ లాక్‌లు, జిపిఎస్ పరికరాలు అమర్చుకోవాలని తెలిపారు. లక్షల రూపాయలు ఖర్చుచేసి వాహనాలను కొనుగోలు చేసేవారు, వాహనాలు దొంగతనాలకు గురికాకుండా ఉండేందుకు సేఫ్టీ లాక్ లు, జిపిఎస్ ఏర్పాటు చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించవద్దని ప్రజలకు తెలిపారు. ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను సమర్థవంతంగా ఛేధించి, ముద్దాయిలను అరెస్ట్ చేసి, 37 వాహనాలను సీజ్ చేసినందుకు సిసిఎస్ డిఎస్పీ పి. జగదీష్ నాయక్, ఇన్స్పెక్టర్ ప్రేమయ్య, బాపట్ల టౌన్ ఇన్స్పెక్టర్ రాంబాబు, చీరాల 1 టౌన్ ఇన్స్పెక్టర్ సుబ్బారావు, సిసిఎస్ ఎస్ఐ రాంబాబు, సిసిఎస్ కానిస్టేబుల్స్ కోటేశ్వరరెడ్డి, కష్ణ, సురేష్, దాసు, చిరంజీవి, హెూంగార్డ్ రవూఫ్‌లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి క్యాష్ రివార్డులను అందజేశారు.

హిందూత్వ ముసుగులో.. బిజెపి ఫాసిస్ట్ విధానాలు

(మొదటిపేజీ తరువాయి)

ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. నిరుద్యోగం అసమానతలు పెరిగిపోతున్నాయని తెలిపారు. ఇక చైనా వంటి సోషలిస్టు దేశాలు సంక్షోభాలకు లోనవకుండా భారీ ఉపాధి అవకాశాలు కల్పిస్తూ ప్రపంచానికి ప్రత్యామ్నాయ ఆర్థిక మార్గాన్ని చూపుతున్నాయని చెప్పారు. ప్రపంచ యువత సోషలిజం వైపు ఆకర్షితులవుతున్నారన్నది ప్రస్తుత రాజకీయ–ఆర్థిక పరిస్థితికి నిదర్శనమని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం దేశ సంపదను మోడీ అనుయాయులైన కార్పొరేట్లకు దోచిపెట్టడమే కాకుండా, మరోవైపు ప్రజలపై పన్నుల రూపంలో భారాలు మోపుతోందని, రైతాంగంపై పెట్టే భారాలు పెరిగిపోవడంతో ఆత్మహత్యలు కొనసాగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కార్యదర్శివర్గ సభ్యులు జీవీ.కొండారెడ్డి ప్రిన్సిపాల్‌గా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్.కె మాబు, కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం రమేష్, డి. సోమయ్య, జిల్లా కమిటీ, మండల కమిటీ సభ్యులు, శాఖా కార్యదర్శులు, జిల్లా నలుమూలలకు చెందిన ముఖ్యకార్యకర్తలు పాల్గొన్నారు.

అద్దంకి పోయే..ఆదాయమూ పోయే.!

(మొదటిపేజీ తరువాయి)

దగ్గరగా ఉందన్న కారణంగా అప్పట్లో దాన్ని ప్రకాశం జిల్లాలోనే ఉంచారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉన్న బాపట్ల, రేపల్లె, వేమూరు, ప్రకాశం జిల్లాలో ఉన్న అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాలతో 2022 ఏప్రిల్ 4న బాపట్ల జిల్లా ఏర్పడింది. సంతనూతలపాడు నియోజకవర్గం బాపట్ల జిల్లాలో చేరని కారణంగా సీనరేజి ద్వారా అత్యధిక ఆదాయాన్ని ఇచ్చే చీమకుర్తి గ్రానైట్ పరిశ్రమను జిల్లా కోల్పోయినట్లు అయ్యింది. అప్పట్లోనే బాపట్ల జిల్లాలో చేరిక విషయమై అద్దంకి నియోజకవర్గ ప్రజల నుంచి అభ్యంతరాలు వచ్చినా అప్పటి వైసిపి ప్రభుత్వం పట్టించుకోలేదు. జిల్లాల ఏర్పాటు విషయంలో తగిన కసరత్తు జరగలేదని తాము అధికారంలోకి వస్తే అద్దంకి ప్రజల కోరిక మేరకు తగిన నిర్ణయం తీసుకుంటామని గడిచిన ఎన్నికల్లో కూటమి నేతలు హామీ ఇచ్చారు. ఈ మేరకు అద్దంకిని రెవెన్యూ డివిజన్‌గా చేయడంతో పాటు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపడానికి కూటమి ప్రభుత్వం అంగీకారం తెలిపింది. ఇందుకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్, అభ్యంతరాల స్వీకరణ అనంతరం నూతన సంవత్సర ప్రారంభంలోనే అద్దంకి నియోజకవర్గం ప్రకాశం జిల్లాలో చేరనుంది. దీంతో గ్రానైట్ క్వారీలు, పరిశ్రమలు ఉన్న బల్లికురవ, సంతమాగులూరు మండలాలు కూడా అద్దంకిలో భాగంగా ఉండి ప్రకాశం జిల్లాలో చేరనున్నాయి. ఈ కారణంగా గణనీయమైన ఆదాయాన్ని ఇచ్చే అద్దంకిని కోల్పోతున్న బాపట్ల జిల్లా ఆర్థికంగా నష్ట పోనుంది. అద్దంకి నియోజకవర్గంలోని బల్లికురవ, సంతమాగులూరు, గురిజేపల్లి ప్రాంతాల్లో క్వారీలు ఉన్నాయి. వందల హెక్టార్లలో విస్తరించి ఉన్న క్వారీల్లో గ్రానైట్ వెలికితీత జరుగుతుంది. ఈ క్వారీల్లో స్టీల్ గ్రే, బ్లాక్ పెరల్ గ్రానైట్ లభిస్తుంది. ఈ గ్రానైట్ క్వారీల నుంచి సీనరేజ్ ద్వారా సంవత్సరానికి రూ.125 కోట్ల మేర జిల్లాకు వస్తుంది. జిల్లాలో గ్రానైట్, ఖనిజ పరిశ్రమల ద్వారా వస్తున్న ఆదాయాన్ని జిల్లాలో పలు అభివృద్ధి పనుల కోసం రాష్ట్రప్రభుత్వం కేటాయించడం జరుగుతుంది. ఇలా వచ్చిన ఆదాయాన్ని జిల్లాపరిషత్ గ్రాంట్ కింద 25 శాతం, మండలాలకు 50 శాతం కేటాయిస్తారు. మరో 25 శాతాన్ని గ్రానైట్ పరిశ్రమలు ఉన్న పంచాయతీల అభివృద్ధికి కేటాయించడం జరుగుతుంది. జిల్లాకు అద్దంకి నియోజకవర్గంలోని గ్రానైట్ పరిశ్రమ తలమానికంగా ఉండేది. కానీ అద్దంకి ప్రకాశం జిల్లాకు వెళ్లనున్నందున పర్చూరు నియోజకవర్గంలోని మార్టూరు మండల పరిధిలో ఉన్న కొద్దిపాటి గ్రానైట్ కటింగ్, పాలిషింగ్ యూనిట్లు మాత్రమే బాపట్ల జిల్లాలో మిగలనున్నాయి. జిల్లాల పునర్విభజన కారణంగా బాపట్ల జిల్లా 5 నియోజకవర్గాలకు పరిమితం కానుంది. బాపట్ల జిల్లా అత్యధిక ఆదాయాన్ని ఇచ్చే అద్దంకి నియోజకవర్గాన్ని కోల్పోవడంతో అంతంత మాత్రంగా ఉన్న జిల్లా అభివృద్ధి మరింత వెనుకబడే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో జిల్లాలో ఉన్న ప్రజాప్రతినిధులు అద్దంకిని కోల్పోవడం ద్వారా జిల్లాకు జరగనున్న నష్టాన్ని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రప్రభుత్వం నుంచి జిల్లాకు మరింత నిధులు వచ్చేలా సమిష్టి కృషి చేయాల్సి ఉంది.

అవసరం లేని రహదారుల విస్తరణకు మాస్టర్ ప్లాన్

- సమస్యాత్మకమైన శిఖరం వారి వీధి విస్తరణ వదిలేశారెందుకు?
- మాస్టర్ ప్లాన్ రోడ్ల ప్రతిపాదనపై పట్టణంలో విమర్శలు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణంలో రోడ్ల విస్తరణ వివాదాస్పదం కానుంది. అవసరం లేని రహదారుల విస్తరణకు మాస్టర్ ప్లాన్ రూపొందించారనే ఆరోపణలు ఉన్నాయి. రానున్న మూడు దశాబ్దాల కాలంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో రహదారుల విస్తరణకు మాస్టర్ ప్లాన్ రూపొందిస్తారు. అయితే బాపట్లలో అందుకు భిన్నంగా ప్లాన్ రూపొందించారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. అవసరంలేని ప్రాంతాల్లో రోడ్ల విస్తరణకు మాస్టర్ ప్లాన్ రూపొందించి నిత్యం వాహనాల రద్దీతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడే శిఖరం వారి వీధి విస్తరణను మాస్టర్ ప్లానులో ఎందుకు పొందుపర్చలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సాధారణంగా ప్రజా సమస్యల ద ృష్ట్యా రాకపోకలకు అంతరాయం ఏర్పడకుండా పట్టణంలో అంతర్గత రహదారుల విస్తరణ చేపడతారు. అయితే పట్టణంలో అనేక రహదారులను 40 నుండి 60 అడుగులు, 60 నుండి 80 అడుగుల విస్తరణకు మాస్టర్ ప్లాన్ రూపొందించారు. వ్యాపారాలతో నిత్యం రద్దీగా ఉండి వాహన రాకపోకలకు, పాదాచారులకు సైతం తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్న శిఖరం వారి వీధి విస్తరణను మాస్టర్ ప్లానులో పొందుపరచలేదు. ఈ వీధి ద్వారా వందల వాహనాలు సముద్ర తీర ప్రాంతం రొయ్యల హేచరీలు, రిసార్ట్సుకు వెళ్ళొచ్చే వాహనాలతో ట్రాఫిక్ అంతరాయం



పట్టణంలో నిత్యం రద్దీగా ఉండే ఇరుకైన శిఖరం వారి వీధి

ఏర్పడుతూనే ఉంది. ఇదే వీధిలో నారాయణ స్కూల్, ప్రైవేటు వసతి గ ృహాలు (లాడ్జీలు), ఆసుపత్రులు, వ్యాయామ కేంద్రాలు, సిమెంట్ షాపులు, ఐరన్ షాపులు, ఎలక్ట్రికల్ షాపులు, ప్లే వుడ్ షాపు, కిరాణా షాపులు, మత్స్యకారుల చేపల వేటకు అవసరమైన వలలు ఇతర పరికరాలు కొనుగోలు చేసే షాపులు ఉన్నాయి. కమర్షియల్ ప్రాంతమైన ఈ రహదారిలో ఆయా షాపులకు వచ్చే వినియోగదారులు ద్విచక్ర వాహనాలు నిలుపుకునేందుకు సైతం ఇక్కడ అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇరుకు మార్గంలోనే వాహనాలు నిలిపి చేయడంతో పాటు పాఠశాల వాహనాలు గంటల తరబడి ఇక్కడ రోడ్లో నిలిపి ఉంచడం ప్రతినిత్యం రాకపోకలు కొనసాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇన్ని సమస్యలు ఉన్నా ఈ రహదారిని మాస్టర్ ప్లానులో పొందుపర్చి భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఉదయం నుండి రాత్రి వరకు నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిని మాస్టర్ ప్లాన్‌లో పెట్టకపోవడంతో సంబంధిత శాఖ అనేక విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా శిఖరం వారి వీధిని మొదలు నుండి చివరి వరకు కనీసం 40 అడుగుల విస్తరణకు మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచాలని కోరుతున్నారు. ప్రస్తుత మాస్టర్ ప్లాన్‌లో 200 మీటర్లు లేని బొగ్గవరపు వారి వీధి, న్యూ షరాఫ్ బజార్‌ను 40 అడుగుల రహదారిగా విస్తరించాలని ప్రణాళిక రూపొందించారు. నిత్యం రద్దీగా ఉండే పాండురంగాపురం రహదారిని 40 అగుల రహదారిగా మాస్టర్ ప్లాన్‌లో ప్రతిపాదించక పోవటం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పాండురంగాపురం రహదారిలో సత్యనారాయణ స్వామి గుడి నుండి పాండురంగాపురం వరకు 60 అడుగుల రహదారిగా మార్చాలన్న ప్రతిపాదన చేసిన అధికారులు శిఖరం వారి వీధి విస్తరణను వదిలేయడం పట్ల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. అసలు సమస్యగా ఉన్న రహదారిని వదిలేయడంలో అంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. లక్షకు చేరిన పట్టణ జనాభా అవసరాలు, పెరిగిన వాహనాల రద్దీకి అనుగుణంగా అంతర్గత రహదారులు విస్తరించాల్సిన అవసరాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన

ప్రజాశక్తి - చీరాల

పట్టణంలో రన్ ఫర్ చీరాల ర్యాలీని పోలీసులు నిర్వహించారు. ఎస్‌పి బి ఉమామహేశ్వర్ ఆదేశాల మేరకు డీఎస్పీ మోయిన్ సూచనలతో ఒకటో పట్టణ సిఐ సుబ్బారావు ఆధ్వర్యంలో ర్యాలి వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాలు, గంజాయి, డ్రగ్స్ వినియోగం, మహిళలపై అత్యాచారాలు, చిన్నారులపై లైంగిక దాడులు వంటి సామాజిక సమస్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణం, గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపరాదని సూచించారు. సమాజంలో భద్రతా చర్యలు బలోపేతం కావాలంటే ప్రజల సహకారం కీలకమని అన్నారు. నేరాల నివారణలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ర్యాలీలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



తీవ్రంగా గాయపడ్డ అక్కా తమ్ముళ్లు సంతోషిని, గౌతమ్

లారీ ఢీ కొని అక్కాతమ్ముళ్లకు గాయాలు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

చెరుకుపల్లి ప్రధాన రహదారిలోని ఐలాండ్ సెంటర్ వద్ద ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న అక్క, తమ్ముళ్లను ప్రమాదవశాత్తు లారీ ఢీ కొనడంతో వారి కాళ్లు నుజ్జు నుజ్జు అయ్యాయి. మండలంలోని తూర్పుపాలెం పంచాయతీకి చెందిన బడే ఆశ సంతోషిని, గౌతమ్ జయకృష్ణ ఆదివారం చెరుకుపల్లి వచ్చి తిరిగి ఇంటికి వెళుతుండగా ఐలాండ్ సెంటర్ వద్ద వెనక నుండి వచ్చిన లారీ వారి కాళ్లపై నుండి వెళ్లడంతో ఇరువురి కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. తమ్ముడు గౌతమ్ జయకృష్ణ కాలు నుజ్జు నుజ్జు అయింది. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



విరాళం అందజేస్తున్న దాతలు

గోశాలకు రూ.10 వేల విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శింగరకొండ హరి హర గోశాల షెడ్ నిర్మాణం చేసేందుకు చిలకల సాంబశివరావు రూ.10 వేలు విరాళం గోశాల సుబ్బారావుకు ఆదివారం అంద చేశారు. ఈ సందర్భంగా ప్రెసిడెంట్ బాచిన శివధర పూర్ణ చంద్రరావు మాట్లాడారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు ఊటుకూరు రామకోటేశ్వరరావు, పువ్వాడ రామకోటేశ్వర రావు, చుండూరి మురళీ సుధాకరరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, సంకా సుబ్రహ్మణ్యం, మహమ్మద్ రఫీ, పిఎల్‌వి నరసింహారావు, నాగయ్య, చిలకల సాంబశివరావు, పిఎస్ కోటేశ్వరరావు, సెక్రటరీ అలహరి హరిప్రసాద్, తమ్మన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

13న పర్చూరులో లోక్ అదాలత్

ప్రజాశక్తి - పర్చూరు

ఈనెల 13న స్థానిక కోర్టు సముదాయం ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ కె ప్రశాంతి ఆదివారం తెలిపారు. లోక్‌అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులపై అప్పీలుకు వెళ్లే అవకాశం ఉండదని చెప్పారు. కక్షి దారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి - బాపట్ల

యాభై యేళ్ల క్రితం బాపట్ల వ్యవసాయ కళాశాలలో వ్యవసాయ విద్య అభ్యశించిన అలనాటి విద్యార్థుల ఆత్మీయ కలయికతో ఆదివారం బాపట్ల వ్యవసాయ కళాశాలలో సందడి చేశారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో 1975-79 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు కళాశాలలో చదువుకొని 50ఏళ్ళు పూర్తైన సందర్భంగా కళాశాలలో పూర్వ విద్యార్థి సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఒకరినొకరు కుశల ప్రశ్నలతో పలకరించుకున్నారు. ఆత్మీయంగా ఆలింగనం చేసుకున్నారు. 2025ను తమ స్వరో?త్సవ సంబరంగా ఉత్సాహభరితంగా నిర్వహించారు. సుదీర్ఘ కాలం అనంతరం కలుసుకున్న అలనాటి వ్యవసాయ విద్యార్థులు ఉద్వేగంతో అప్పటి మధుర జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఒకరి అనుభవాలు మరొకరితో అరమరికలు లేకుండా పంచుకున్నారు. 60 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్న ఈ అపూర్వ కలయికలో నలుగురు మహిళా విద్యార్థినులు పాల్గొనడం విశేషం. ఇక్కడ విద్యానంతరం వైద్య విద్యనభ్యసించి వైద్య వృత్తి చేపట్టిన నలుగురు ఎంబిబిఎస్ డాక్టర్లు, అఖిల భారత సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో క ృతార్థులై ఐఎఫ్ఎస్‌కు ఎంపికైన నలుగురు అధికారులు, బ్యాంక్ చీఫ్ జనరల్ మేనేజర్లు, వివిధ రంగాల్లో నిష్ణా?తులై తమ పదవులకు వన్నె చేకూర్చి, తమ కళాశాలకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టిన ఉన్నత విద్యావంతులు ఈ ఆత్మీయ కలయకులో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కరా?టక రాష్ట్రాల్లో వివిధ హోదాల్లో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన వీరు సంఘటితమై తమకు విద్య నేర్పిన 12 మంది గురువులను ద ృశ్శాలువలతో సన్మానించి గురుభక్తి చాటుకున్నారు. ఆ బ్యాచ్ పూర్వ విద్యార్థి సంఘం నాయకులు జె ధర్మారావు, పి రాజశేఖరరావు, కళాశాల అసోసియేట్ డీన్ పి ప్రసూనరాణి, బోధనా సిబ్బంది పాల్గొన్నారు.



వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థులు

చదువే సమాజంలో గౌరవాన్ని తెప్పిస్తుంది

మాజీ జెడ్‌పిటిసి శివరామిరెడ్డి

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరంలో ఆధునిక బారత నిర్మాత, బారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 69వ వర్ధంతి సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ జెడ్‌పిటిసి, పర్చూరు కాలేజీ కమిటీ అధ్యక్షులైన తనుబొద్ది శివరామిరెడ్డి మాట్లాడారు. చదువే మనిషికి సమాజంలో గౌరవాన్ని తెస్తుందని అన్నారు. తొలుత అంబేద్కర్ చిత్ర పటం ముందు క్రొవత్తులు వెలిగించి నివాళి అర్పించారు. పాఠశాల విద్యార్థులు ఆర్చిత, దీవెన, న్యాన్సీ వందేమాతరం గీతం ఆలపించారు. సభకు ఎస్‌సిఆర్‌సి పర్చూరు సొసైటీ కన్వీనర్ రాము అధ్యక్షత వహించారు. అంబేద్కర్ జ్ఞాన సొసైటీ అధ్యక్షుడు, ఉమ్మడి ప్రకాశం జిల్లా బహుజన నాయకులు చిన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ అంబేద్కర్ భారత ప్రజలందరికీ రాజ్యాంగ బద్ధమైన హక్కులు, సౌకర్యాలు కల్పించారని అన్నారు. కులాలు, మతాలకు అతీతంగా మహిళలు అందరికీ సమాన అవకాశాలు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో అంటరానితనం నిర్మూలన పోరాట సమితి జిల్లా కార్యదర్శి ఉదయ భాస్కర్, అభి, ఎఐఎంఎస్ మార్టూరు కార్యదర్శి బాబు, తనుబొద్దివారిపాలెం రైతు నాయకులు చిన్న, యువకులు రమేష్, రాకేష్, బాబు, మహేష్, అభి, నాని, భరత్, పండు, రమేష్, రాకేష్, మహిళలు రత్న కుమారి, రావమ్మ, నాగేంద్రం, ప్రమీల, విద్యార్థులు కార్తిక్, శాంతి భూషణ్, రోహిత్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ జెడ్‌పిటిసి తనుబొద్ది శివరామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న అంజిరెడ్డి

ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన

ప్రజాశక్తి - సంతమాగులూరు

మన బాల భారతి విద్యా సంస్థలో ఉన్నత ప్రమాణాలతో విద్యా బోధన చేస్తున్నట్లు విద్యా సంస్థ అకాడమిక్ డైరెక్టర్ ఒంటెద్దు అంజిరెడ్డి తెలిపారు. మండలంలోని పుట్టావారిపాలెం సమీపంలోని విద్యా సంస్థలో ఆయన విలేకర్లతో ఆదివారం మాట్లాడారు. సంతమాగులూరు ప్రాంతంలో తమ విద్యా సంస్థ ప్రారంభించి పదేళ్లు పూర్తయిందని అన్నారు. యాజమాన్య భాగస్వామి అయిన పవన్ కుమార్, ముప్పాళ్ళ వెంకటేశ్వర్లు కలయికతో 2016 జూన్ 9న 470 మంది విద్యార్థులతో ప్రారంభించినట్లు తెలిపారు. విద్యారంగంలో వ ృత్తి నైపుణ్యానికి సంబంధించిన ప్రయోజనకరమైన కోర్సులు ప్రవేశపెడుతూ పదేళ్ల ప్రస్థానం కొనసాగించామని అన్నారు. ప్రస్తుతం 1250 మంది విద్యార్థులతో విద్యా సంస్థ విజయవంతంగా నడుస్తుందని అన్నారు. పరిసర ప్రాంతాల ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎక్కడా లేని విధంగా హైదరాబాదు ఈ అభ్యస సౌజన్యంతో ఒలంపిక్ యాడ్ కోర్సులు ప్రవేశపెట్టి విద్యార్థుల భవితకు మంచి పునాది వేస్తున్నామని అన్నారు. బాల, బాలికలకు 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు వివిధ రకాల రాష్ట్ర స్థాయి పోటీలకు సంసిద్ధులను చేస్తూ విజయవంతంగా విద్యార్థులు రాష్ట్రస్థాయి బహుమతులు సాధించినట్లు తెలిపారు. 2026 జూన్ 9న పాఠశాల 10వ వార్షికోత్సవం నిర్వహించనున్న నేపథ్యంలో తమ సంస్థ విజయాలు వివరిస్తున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థిపట్ల వ్యక్తిగత శ్రద్ధతో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. కార్పోరేటుకు ధీటైన ఫలితాలు సాధిస్తూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నట్లు తెలిపారు. తమ పాఠశాల 10ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న నేపథ్యంలో 25ఏళ్లుగా పాత్రికేయ వృత్తిలో ఉండి ఇటీవల షష్టి పూర్తి చేసుకున్న 'ప్రజాశక్తి విలేఖరి ఓర్సు కొండలును విద్యా సంస్థ యాజమాన్యం తరపున అంజిరెడ్డి, డి పవన్ కుమార్ దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. పాత్రికేయుల పిల్లలకు తమ సంస్థ బోధన ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు.

ఎల్లప్పుడూ దోపిడీకి గురికావాల్సిందేనా ?

ప్రజాశక్తి - భట్టిపోలు

మండల కేంద్రమైన భట్టిప్రోలు పంచాయతీ కార్యాలయం ఎన్ని పాలకవర్గాలు మారిన దోపిడీకి గురి కావాల్సిందేనాని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సుమారు 20ఏళ్లుగా పంచాయతీకి ఎన్నికైన సర్పంచులు, పాలకవర్గ సభ్యులు నిరంతరం నిధులు దుర్వినియోగానికి పాల్పడుతూ పంచాయితీని దోపిడీకి గురి చేస్తున్నారు. ఈ విధానం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. సుమారు రూ.1.50 కోట్లకు పైగా ఆదాయం ఉన్న పంచాయతీలో గత ఐదు పాలకవర్గ సభ్యులు నిధులు దుర్వినియోగానికి పాల్పడుతూ వచ్చారు. పంచాయతీ నిధులు దోచుకుంటున్న ఘటనలు ఉన్నాయి. గతంలో పనిచేసిన నాయకులు, పాలకవర్గ సభ్యులు పంచాయతీలో అభివృద్ధి పనుల పేరట రూ.కోట్ల నిధులు సేకరించి వాటిని సక్రమంగా వినియోగించకుండా దుర్వినియోగం చేసిన ఆరోపణ ఉన్నాయి. అదే రీతిలో గత వైసీపీ ప్రభుత్వ పాలల్లో కూడా పాలకవర్గ సభ్యులు పంచాయతీ నిధులు రూ.కోట్లలో అవినీతికి పాల్పడి అధికారులు సైతం సస్పెండ్‌కు గురైన సంఘటనలు చూస్తూనే ఉన్నాం. తాము గొప్ప అంటే తాము గొప్ప అని చెప్పుకునే నాయకులు సైతం ఒకప్పుడు పంచాయతీలో అవినీతి, అక్రమాలకు గురై పాలకవర్గ సభ్యుల ఎదుట ధర్నాలకు



భట్టిప్రోలు గ్రామపంచాయతీ కార్యాలయం

సైతం చేసిన వారే. అంతేకాక రిజర్వేషన్లలో ఎన్నికైన సర్పంచుల స్థానంలో షాడోల పాలన కొనసాగుతుంది. వారికి వ్యతిరేకంగా పాలన కొనసాగించి కేసులు సైతం ఎదుర్కొన్న ఘటనలు ఉన్నాయి. పంచాయతీలో 20ఏళ్ల క్రితం సర్పంచి పదవి జనరల్‌కు కేటాయించారు. తదనంతరం ఓసి మహిళ, ఎస్సీ, ఎస్టీ కేటగిరీల్లో సర్పంచ్ పదవికి రిజర్వు అయ్యాయి. రానున్న ఎన్నికల్లో పంచాయతీ జనరల్ అభ్యర్థి పోటీ చేసే విధంగా రిజర్వేషన్ అందుబాటులోకి రానున్నదని పలువురు విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. అదే జరిగితే జనరల్‌లో ఇరు పార్టీల అభ్యర్థులు పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. కానీ ఇప్పటివరకు జరిగిన పంచాయతీ ఎన్నికలు ఒక ఎత్తు కాగా రానున్న ఎన్నికలు మరొక ఎత్తుగా కనిపిస్తున్నాయి.

నిస్వార్ధ రాజకీయ నాయకులను ఎన్నుకోవాలి

రాను ఎన్నికల్లో నీతి, నిజాయితీగా పరిపాలన చేసే నాయకులను ప్రజలు ఎన్నుకునేందుకు కృత నిశ్చయంతో ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రస్తుతం తాము ప్రభుత్వం నుండి అనేక విధాలుగా నిధుల సమకూర్చి గ్రామాభివృద్ధి చేస్తామని, నీతి, నిజాయితీగా పాలన చేస్తామని చెప్పుకునే నాయకులు కూడా ఒకప్పుడు గ్రామంలో అనేక ఆరోపణలు ఎదుర్కొన్నవారే. ఈ పరిస్థితుల్లో గ్రామ అభివృద్ధికి నిస్వార్థంగా వ్యవహరించే నాయకుల కోసం గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారు. పార్టీలకు అతీతంగా ప్రజల కోసం, గ్రామ అభివృద్ధి కోసం పనిచేసే నిస్వార్థ నాయకులు రానున్న ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ముందుకు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ప్రస్తుతం ఉన్న నాయకులు వారి స్వార్థ ప్రయోజనాలకు తప్ప గ్రామ అభివృద్ధికి తోడ్పడే వారే లేరని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధిక ఆదాయం కలిగిన భట్టిప్రోలు పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించి నిస్వార్థంగా ప్రజా ప్రయోజనాల కోసం పనిచేసేందుకు నూతన నాయకులు, యువత ముందుకు రావాలని గ్రామ ప్రజలు కోరుచున్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఎల్ఎ కొండయ్య

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - చీరాల

ఈనెల 12న స్థానిక ఎన్ఆర్ అండ్ పిఎం ఉన్నత పాఠశాల ఆవరణలో ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్, శాసన సభ్యులు ఎంఎం కొండయ్య ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం నైపుణ్య శిక్షణ ఇవ్వడంతోపాటు జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



చిన్నారులతో మునిసిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి

సందడిగా ఆనంద ఆదివారం

ప్రజాశక్తి - బాపట్ల

'ఆనంద ఆదివారం' సంతోషాల సందడి పట్టణంలో ఆదివారం సాయంత్రం పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రతి ఆదివారం జరిగే ఆనంద ఆదివార కార్యక్రమంలో అనేక సాంస్కృతిక నృత్య కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని పట్టణంలో వైభవంగా నిర్వహించారు. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఆదివారం నిర్వహించే కార్యక్రమానికి పట్టణ ప్రజల నుండి మంచి స్పందన లభిస్తుందని అన్నారు. మానసిక ఉత్సాహానికి, ఉల్లాసానికి ఆనంద వారం ఎంతగానో దోహద పడుతుందని అన్నారు. జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సంధానకర్తగా వ్యవహరించిన కార్యక్రమంలో టిడిపి నాయకులు గొలపల శ్రీనివాసరావు, బూర్లె రామ సుబ్బారావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దయనీయ స్థితిలో ధాన్యం రైతు



హార్వెస్టర్ నుండి ట్రాక్టర్లోకి ధాన్యం పోస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - వేమూరు

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో రైతులు సాగుచేసిన వరి పంట దిగుబడులు తగ్గింది. దానికి తోడు ఉన్న పంటకు గిట్టుబాటు ధర లేక ధాన్యం రైతు పరిస్థితి దయనీయంగా మారింది. తుపాను కారణంగా దిగుబడులు తగ్గిపోయి రైతులు అల్లాడుతుంటే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ అవి రైతులకు అక్కరకు రాకపోవాటంతో ప్రైవేటు వ్యాపారులకు అయిన కాడికి అమ్ముకోక తప్పటం లేదు. ప్రభుత్వ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో 75 కేజీలు బస్తా రూ.1775 ఉన్నప్పటికీ ప్రభుత్వ నిబంధనలు రైతులకు శాపంగా మారాయి. దీంతో ప్రైవేటు వ్యాపారస్తులను ఆశించక తప్పటం లేదని రైతులు వాపోతున్నారు. తేమ శాతం, తాలుతప్పలు వంటి అంశాలు, ట్రాన్స్‌పోర్టు వంటి విధానాలు సాధారణ రైతులు నిర్వహించుకోలేకపోవడంతో ప్రైవేటు వ్యాపారస్తులే నయమనే రీతిలో దుస్థితి నెలకొంది. హార్వెస్టర్ ద్వారా వరి పంట కోత కోసిన రైతులు వాటిని ఆరబెట్టుకునేందుకు అవకాశం లేక అనేకమంది 75 కేజీలకు బస్తా రూ.1200 నుండి రూ.1300కు విక్రయించుకోక తప్పటం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత అధ్వానంగా మారింది. నియోజకవర్గంలోని కొల్లూరు, వేమూరు, అమృతలూరు, చుండూరు మండలాల్లో రైతులు వెద పద్ధతిలో సాగు చేశారు. ఆ పంటను హార్వెస్టర్లతో కోత కోస్తున్నారు. ఆ రైతులు అధిక శాతం ధాన్యాన్ని ప్రైవేటు వ్యాపారస్తులకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఉన్న ధరతో రైతులకు కనీసం ఖర్చులు కూడా గిట్టుబాటు అయ్యే పరిస్థితి లేదని వాపోతున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలు సవరించి కౌలు రైతులకు సైతం ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ధాన్యం ఆరబోసుకుంటున్న రైతులు

'రోటరీ' యువజన వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - చీరాల

రోటరీ కమ్యూనిటీ హాలులో రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్ సంయుక్తంగా వలివేటి మురళీ కృష్ణ సారధ్యంలో యువజన వారోత్సవాలు ఆదివారం ప్రారంభించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు మాట్లాడారు. తొలిరోజు చెస్ పోటీలతో ప్రారంభమై డ్యాన్స్ బేబి డ్యాన్స్ కార్యక్రమంతో ముగుస్తుందని తెలిపారు. చెస్ పోటీల్లో వివిధ పాఠశాలలకు సీనియర్స్ 38మంది, జూనియర్స్ 36మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులలో సృజనాత్మక శక్తి వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అననారు. 8రోజులు వివిధ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివిధ రకాల ఆటల పోటీలతోపాటు విద్యార్థుల్లో పఠనా సామర్థ్యం పెంచే విధంగా క్విజ్, వ్యాసరచన,, ఉపన్యాం వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శారీరక, మానసిక వికాసం పొందేలా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్గనైజర్స్‌గా డాక్టర్ విజయకుమార్, బాల వెంకటేశ్వరరావు, నక్కల సురేష్ బాబు, శంకరరెడ్డి, చుక్కా శ్రీనివాసరావు వ్యవహరించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు జాలాది కృష్ణమూర్తి, తిరుమలశెట్టి లక్ష్మీ ప్రతాప్, వాకర్స్ అసోసియేషన్ నాయకులు పోలుదాసు రామకృష్ణ, గుర్రం రాఘవరావు, డాక్టర్ ఐ బాబూరావు, డివి సురేష్, శివ రంగనాయకులు, రామారావు, శివాంజనేయప్రసాద్, ప్రసాద్, పుల్లయ్యనాయుడు, సుభాషిణి, భానుకుమారి, రమాదేవి, సౌభాగ్యలక్ష్మి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రోటరీ గవర్నర్ నాగభైరు శ్రీనివాసరావు



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

ఆటలతో మానసిక ఉత్సాహం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతరంలో అనంతవరం వాలీబాల్ ప్రీమియర్ లీగ్ పోటీలు 3వ రోజు నిర్వహించారు. వాలీబాల్ పోటీలకు యనమదల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు గుంటుపల్లి శ్రీనివాసరావు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ ఆటలు ఉత్సాహాన్ని పెంచుతాయని అన్నారు. రాష్ట్ర దళిత నాయకులు సాతులు రవి మాట్లాడుతూ విద్యార్థులు, యువత చదువుతోపాటు ఆటల్లో కూడా రాణించలని అన్నారు. ఆదివారం జరిగిన పోటీల్లో ఆరు టీములు పాల్గొన్నాయని నిర్వహణ కమిటీ కన్వీనర్ అభి తెలిపారు. పోటీల్లో ఎడ్లపాడు కెఎఫ్‌సి యూత్, పర్చూరు అంబేద్కర్ యూత్, ఎడ్లపాడు రానా యూత్, వేటపాలెం విటిఎం యూత్, టిఎంపి యూత్, అనంతపురం అంబేద్కర్ యూత్ పాల్గొన్నట్లు తెలిపారు. మొదటి బహుమతి ఎడ్లపాడు కెఎఫ్‌సి యూత్, ద్వితీయ బహుమతి వేటపాలెం విటిఎం యూత్, త ృతీయ బహుమతి చిలకలూరిపేట టిఎంపి యూత్ కైవశం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. విజేతలకు ఈ నెల 14న బహుమతులు అందిస్థామని చెప్పారు. లైన్ ఎంపైర్లుగా మహేష్, రాజు, భరత్, రాజేష్, రాంబాబు వ్యవహరించారు. పోటీలకు అతిధులుగా విచ్చేసిన ఎఎన్‌పిఎస్ జిల్లా కార్యదర్శి ఉదయ్ భాస్కర్, పర్చూరు ఎస్‌సిఆర్‌పి సొసైటీ కన్వీనర్ రాముకు క్రీడాకారులను పరిశయం చేశారు.



విద్యార్థులకు ట్యూషన్ ప్రారంభిస్తున్న దృశ్యం

చదువు పేదలకు ఒక వరం

తెలుగుదేశం నాయకులు గుర్రం ఆదిశేఖర్

ప్రజాశక్తి - పంగులూరు

ఆర్థిక సమస్యలతో సతమతమయ్యే పేదల కుటుంబాల్లో పిల్లలు చదువుకొని స్థిరపడాలని, మంచి భవిష్యత్తు పొందాలని తెలుగుదేశం నాయకులు గుర్రం ఆదిశేకర్ అన్నారు. శనివారం రాత్రి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందరరేగా మండలంలోని జనకవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో విద్యార్థులకు ట్యూషన్ ప్రారంభించారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ పేదలకు చదువు ఒక వరం లాంటిదని అన్నారు. చదువు ద్వారా వచ్చిన విజ్ఞానం, వివేకంతో ప్రపంచాన్ని గెలవచ్చని అన్నారు. అందుకు అంబేద్కర్ ఒక ఉదాహరణని అన్నారు. ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న పేద పిల్లలను ప్రోత్సహించి చదివించాలని అన్నారు. వారిని సమాజంలో ఉన్నతమైన శిఖరాల్లో నిలబెట్టేందుకు మిగతా వర్గాలు కృషి చేయాలని చెప్పారు. ఇందుకోసం జనకవరంలో చదువుకుంటున్న 1 నుండి 10వ తరగతి పిల్లలకు ఏడాది పాటు స్థానిక పాఠశాల్లో రాత్రిపూట ట్యూషన్ ఏర్పాటు చేశామని అన్నారు. ఇందుకోసం ఇద్దరు వాలంటీర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. చక్కగా చదువుకొని మంచి భవిష్యత్తు పొందాలని అన్నారు. సాయంత్రం 5 నుండి 8 గంటల వరకు సాగి ట్యూషన్‌లో విద్యార్థులు వారి సమస్యలను ఉపాధ్యాయులతో పంచుకొని, బాగా చదువుకోవాలని అన్నారు. ట్యూషన్ నిర్వహణకు గ్రామస్తులు కూడా ఇందుకు సహకరించాలని కోరారు. తల్లిదండ్రులు వారి పిల్లలను క్రమం తప్పకుండా ట్యూషన్‌కు పంపాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మమత, కృష్ణవేణి, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నెక్స్ట్‌జెన్ బాలోత్సవ్

ప్రతిభ కనబరుస్తున్న విద్యార్థులు



నృత్యం చేస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యార్థులకు తమ ప్రతిభా పాటవాలు ప్రదర్శించడానికి ఒక మంచి వేదిక ఏర్పాటు చేయాలనే సంకల్పంతో ఒంగోలులోని నెక్స్ట్ జెన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బాలోత్సవ్ ఉత్సాహంగా కొనసాగుతోంది. బాలోత్సవ్‌లో 90కి పైగా విద్యాసంస్థలనుండి వివిధ ప్రాంతాల నుండి విచ్చేసిన సుమారు 1100 మంది విద్యార్థులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో ప్రముఖ సంగీత విద్వాంసులు, గిన్నిస్ వరల్డ్ బుక్ రికార్డ్ గ్రహీత డాక్టర్ గజల్ శ్రీనివాస్ శనివారం ప్రారంభించారు. ఇందులో మొత్తం 27 అంశాలలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో 64 పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తతీయ స్థానాలలో నిలిచిన విజేతలు ఈ నెల 14న జరిగే నెక్స్ట్ జెన్ కార్నివాల్‌లో ప్రముఖులతో బహుమతి ప్రదానం చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో స్కూల్ యాజమాన్య ప్రతినిధులైన డాక్టర్ కె. మురళీధర్‌రెడ్డి, కె.శ్రీకాంత్ బాబు, అరవింద, శ్రీవిద్య మరియు ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ఎల్‌వి రమేష్‌తో పాటు వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'డ్వాక్రా'లో మోసం.!

- సుమారు రూ.30 లక్షలు గోల్‌మాల్
- మంత్రి డాక్టర్ స్వామికి గిరిజన మహిళల ఫిర్యాదు

ప్రజాశక్తి-శింగరాయకొండ

జరుగుమల్లి మండలం దావగూడూరులో గిరిజన డ్వాక్రా మహిళలకు మోసం జరిగింది. న్యాయం చేయాలని గిరిజన మహిళలు ఆదివారం నాడు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామిని కలిసి సమస్యలు వివరించారు. గ్రామానికి చెందిన గిరిజన మహిళలు డ్వాక్రాలో కొన్ని సంవత్సరాలుగా ఉంటున్నారు. గ్రామంలో పనిచేస్తున్న వివోఏ తమ దగ్గర డబ్బులు బ్యాంకులో కడతానని వసూలు చేసుకుని బ్యాంకులకు కట్టకుండా.. శ్రీనిధిలో డబ్బులు తీసుకొని కట్టకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని వివరించారు. బ్యాంకులకు సంబంధించి రూ.25 లక్షలు, శ్రీనిధికి సంబంధించి రూ.7 లక్షల నగదు గోల్‌మాల్ చేసినట్లు తెలిపారు. దీనిపై ఇప్పటికే పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు కూడా చేయడం జరిగిందని వివరించారు. మంత్రి వెంటనే జిల్లా అధికారులతో మాట్లాడి ఈ సమస్యను పరిష్కారం చేయాలని సూచించారు.



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి స్వామి

జరుగుమల్లి మండలం దావగుడూరుతో పాటు శింగరాయకొండ మండలం బింగినపల్లిలో కూడా ఇలాంటి సమస్య ఉందని, రెండు గ్రామాల్లో ఉన్న సమస్యను పరిష్కారం చేయాలని జిల్లా అధికారులకు కోరారు. శింగరాయకొండ సిఐ సిహెచ్ హజరత్తయ్యకి ఫోన్ చేసి.. జరుగుమల్లి, శింగరాయకొండ ఏపీఎంలు ఫిర్యాదు చేస్తారని, ఆ కేసులు నమోదు చేసి డ్వాక్రా మహిళలకు న్యాయం జరిగే విధంగా చూడాలని సూచించారు. గ్రామస్తులు మాత్రం కేసులు నమోదు చేయడంతో పాటు విజిలెన్స్ ఎంక్వయిరీ జరిపితే చాలా విషయాలు బయటకు వస్తాయని కోరారు. డ్వాక్రా మహిళలకు ఇబ్బందులు లేకుండా చూస్తానని మహిళలకు మంత్రి హామీ ఇచ్చారు.

'1100' సేవలను వినియోగించుకోండి

- 8న కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహణ
- కలెక్టర్ పి. రాజబాబు



కలెక్టర్ రాజాబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మీ కోసం కాల్ సెంటర్ 1100 సేవలను వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు దాఖలు చేసిన తమ అర్జీలు ఇప్పటికీ పరిష్కారం కాకపోయినా, లేదా తమ ఫిర్యాదులకు సంబంధించిన సమాచారం తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చునన్నారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవడానికి 'మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్' వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 8న సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. అర్జీదారులు గతంలో ఇచ్చిన అర్జీలకు సంబంధించిన స్లిప్పును తీసుకురావాలని సూచించారు. సమస్య పరిష్కారమైనప్పుడు ఫోన్ కి మెసేజ్ వస్తుందని, అర్జీదారులు వారి ఫోన్ ను చెక్ చేసుకోవాలన్నారు. నోటీసులు, ఎండార్స్మెంట్ ను వాట్సఅప్ లో పంపిస్తున్నామని, ఎండార్స్మెంట్ బై రిజిస్టర్ పోస్ట్ మీరు ఇస్తున్న అడ్రస్ కు పంపిస్తున్నామన్నారు. అర్జీ ఇచ్చేటప్పుడు దానిని కరెక్ట్ గా దానిని పూరించాలన్నారు. రిపీటెడ్ అర్జీదారులు పాత రసీదును తీసుకురావాలన్నారు. జిల్లా ప్రజలు పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి చెకుముకి సంబరాలను

జయప్రదం చేయాలి

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

శాస్త్రీయ దక్పథాన్ని ప్రజల్లో నాటే లక్ష్యంతో జనవిజ్ఞానవేదిక ఈ సారి రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను డిసెంబర్ 21 నుండి 23 వరకు కాకినాడ జేఎన్టీయూలో నిర్వహించనున్నట్లు జెవివి నాయకులు ప్రకటించారు. ఆదివారం ఒంగోలులోని ఎల్‌బీజీ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెవివి జిల్లా నాయకులు గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవివి సీనియర్ నాయకులు ఎ.వి. పుల్లారావు మాట్లాడుతూ గత 35 ఏళ్లుగా విద్యార్థుల్లో శాస్త్రీయ ఆలోచన, వివేచనాభావాన్ని పెంపొందించేందుకు చెకుముకి విజ్ఞానోత్సవాలు నిరంతరంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పాఠశాల స్థాయి చెకుముకి నిర్వహించిన కార్యక్రమంలో 5 లక్షల మంది విద్యార్థులు పాల్గొనడం, సైన్స్ పై విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తికి నిదర్శనమన్నారు.

జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.హెచ్ జయప్రకాష్ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలలో మొదటి స్థానం సాధించిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల టీమ్‌లు రాష్ట్రస్థాయి సంబరాల్లో పోటీపడతారని చెప్పారు. ఇస్రో, సిసిఎంబీ, పర్యావరణ, విద్యా వైద్య రంగాల్లో నిపుణులు, శాస్త్రవేత్తలు, అధికారులు కార్యక్రమాలకు హాజరవుతారని వివరించారు.

రాష్ట్రస్థాయి చెకుముకిలో రాత పరీక్ష, క్విజ్, ఎక్స్‌పెరిమెంటల్ రౌండ్, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ఇస్రో మొబైల్ ఎగ్జిబిషన్, విద్యార్థుల వ్యాసరచన, విజ్ఞాన-వినోద యాత్ర వంటి అంశాలు ప్రధాన విశేషాలుగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

జెవివి జిల్లా అధ్యక్షుడు యు.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ చైతన్యాన్ని బలోపేతం చేస్తూ, మూఢనమ్మకాల నిర్మూలన దిశగా జెవివి చేస్తున్న కషిని వివరించారు. ప్రశ్నించే తత్వం పెంచడం, సైన్స్ పట్ల ఆసక్తిని పెంపొందించడం తమ ప్రధాన లక్ష్యమని అన్నారు.

జిల్లా స్థాయిలో మొదటి స్థానాలు సాధించిన జడ్‌పీహెచ్ఎస్ కాకర్ల (మర్రిపూడి మండలం), సూర్య విద్యా నికేతన్ గిద్దలూరు బందాలు రాష్ట్రస్థాయి పోటీలకు వెళుతున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు వి మాలకొండారెడ్డి, కె సుబ్రహ్మణ్యం, యస్వి రంగారెడ్డి, కె శంకర్ పాల్గొన్నారు.

ఉద్యాన రైతుల అభ్యున్నతే లక్ష్యం

- పండ్ల తోటల రైతులకు రాయితీలు
- హైబ్రీడ్ కూరగాయల పథకం అమలు
- 90 ఫారమ్ పాండ్స్
- జిల్లా ఉద్యాన అధికారి గోపీచంద్



ముఖాముఖి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో ఉద్యాన రైతుల అభ్యున్నతే లక్ష్యంగా పని చేస్తున్నట్లు జిల్లా ఉద్యాన అధికారి వైఎంఎస్‌వి‌ఎన్ గోపీచంద్ తెలిపారు. జిల్లా సమగ్ర ఉద్యాన పంటల అభివద్ధి పథకంలో పండ్ల జరుగుతుందన్నారు. పండ్ల తోటలలో నీరు నిల్వ తోట సాగు చేస్తున్న రైతులకు రాయితీలు ఇస్తున్నామన్నారు. హైబ్రీడ్ కూరగాయల పథకంలో లబ్దిదారుల ఎంపిక చేయటానికి 90 ఫారమ్ పాండ్స్ నిర్మిస్తున్నామన్నారు. ఉద్యాన యాంత్రీకరణ పథకంలో 50 శాతం రాయితీపై యంత్రాలు రైతులకు అందజేస్తామన్నారు. జిల్లా ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అందిస్తున్న రాయితీలను జిల్లా ఉద్యాన అధికారి 'ప్రజాశక్తి'కి వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వం, కలెక్టర్ ఏ.రాజాబాబు ఆదేశాల మేరకు జిల్లాలోని ఉద్యాన రైతులకు అవసరమైన రాయితీలు అందించేందుకు కషి చేస్తున్నాం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను 100 శాతం సాధించేందుకు చర్యలు చేపడుతున్నాం.

పండ్ల తోటల రైతులకు రాయితీలు

జిల్లా సమగ్ర ఉద్యాన పంటల అభివద్ధి మిషన్ (ఎంఐడి హెచ్) 2025- 26లో కొత్తగా పండ్ల తోటలు సాగు చేసే రైతులకు 40 శాతం రాయితీతో పండ్ల తోటల సాగుకు సుమారు 400 హెక్టార్లకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటి వరకు 194.46 హెక్టార్లల్లో లబ్ధిదారులు ఎంపిక చేశాం. 76, 90 శాతం రాయితీపై రెండవ, మూడవ సంవత్సరం పండ్ల తోటల నిర్వహణకు 613,93 హెక్టార్లకు రూ.26 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. 360 హెక్టార్లల్లో లబ్దిదారుల ఎంపిక పూర్తి దేశాం

90 ఫారం పాండ్స్ నిర్మాణం

పండ్ల తోటలలో నీరు నిల్వ చేయటానికి 90 ఫారం పాండ్స్ (నీటి కుంటలు) నిర్మాణానికికార్యావరణ ప్రణాళిక ఆమోదించాం. 4 కమ్యూనిటీ ఫారం పాండ్ (నీటి కుంట) నిర్మాణానికి రూ.80 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. ఇప్పటివరకు 22 ఫారం పాండ్స్ నిర్మాణానికి పరిపాలన అనుమతి ఇచ్చాం. రక్షిత వ్యవసాయ పథకంలో 50 శాతం రాయితీపై అధిక విలువ కలిగిన కూరగాయలు, పూల తోటల సంవత్సరం పొడవున సాగు చేయటానికి 3,90 హెక్టార్లలో రూ.1.41 కోట్లకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. దానిమ్మ తోటల్లో రక్షణ వలలకు 62.50 హెక్టార్లలో రూ.20.73 లక్షలకు కార్య ప్రణాళిక ఆమోదించాం. 2.40 హెక్టార్లల్లో లబ్దిదారులను గుర్తించాం.

హైబ్రీడ్ కూరగాయల విస్తరణ పథకం

హైబ్రీడ్ కూరగాయల విస్తరణ పథకంలో ఒక హెక్టారుకు రూ.20 వేలు చొప్పున ఆర్థిక సహాయంతో 150 హెక్టార్లలో రూ. 30 లక్షలకు కార్యాచరణ ప్రణాళిక ఆమోదించాం. ఇందుకు సంబంధించిన లబ్దిదారులను ఎంపిక చేశాం. పూల తోటల సాగు విధకంలో ఒక హెక్టారుకు రూ.16 వేలు చొప్పున ఆర్థిక సహాయంతో 260.00 హెక్టార్లలో రూ.41.6 లక్షలకు కార్యావరణ ప్రణాళిక ఆమోదించాం. 11.85 హెక్టార్లల్లో బబ్దిదారుల ఎంపిక పూర్తి అయింది.

50 శాతం రాయితీపై..

ఉద్యాన యాంత్రీకరణ పథకంలో 50 శాతం రాయితీపై 354 (మిని ట్రాక్టర్లు, ఫ్లవర్ బిల్లర్లు, ట్రాక్టర్ మౌంటెడ్ స్ప్రేయర్లు, తైవాన్ స్ప్రేయర్లు) రూ.660.10 లక్షలకు కార్య ప్రణాళిక ఆమోదించాం. సమీకృత పోషక నిర్వహణ, సమీకృత సస్యరక్షణలో 50 హెక్టార్లలో రూ.0.60 లక్షలకు కార్య ప్రణాళిక ఆమోదించాం.